POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
డిసెంబర్ 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 42 సంచిక: 08



## శ్రీ దత్త జయంతి

(15.12.2024)

## ఈ నెల పండుగలు

డిసెంబర్ 11 - శ్రీ మాణిక్య ప్రభు ఆరాధన [మార్గశిర శుద్ధ ఏకాదశి]
డిసెంబర్ 15 - శ్రీ దత్త జయంతి
డిసెంబర్ 25 - క్రిస్టమస్

"శ్రీ సాయి దత్తాత్రేయులవారి సంపూర్ణావతారము, శ్రీ దత్తాత్రేయుల వారు త్రిమూర్తులు, పరబ్రహ్మము ఒకే అవతారంలో యిముడ్చుకొన్న అవతారం. శ్రీ గురుధ్యాన శ్లోకం గురుతత్వాన్ని అలానే కీర్తిస్తుంది. అంటే భగవంతుడు గురువుగా అవతరించిన తత్త్వమే శ్రీ దత్తుడు. పురాణాలన్నీ శ్రీ దత్తాత్రేయులవారిని;

*'దత్తస్త్వయోగాదధ యోగనాథః'*

'దత్తాత్రేయుడు యోగనాథుడు' అని కీర్తించాయి. అంటే ఏకాలంలోనైనా, దేశంలోనైనా, మతంలోనైనా మానవులు ఆధ్యాత్మిక జ్ఞానానికై కృషిచేసి మహనీయులైనారంటే, అలా జరగడానికి వారిని ప్రబోధించి, ప్రేరేపించి, అందుకువలసిన దోహదం చేసి కృతార్థులనుచేస్తున్న భగవత్ తత్త్వమేదున్నదో దానిని దత్తాత్రేయుడన్నారు."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**


# ఏసు చెప్పిన మాట!

**_పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ_**

ఈ నెల 25వ తేదీన ప్రపంచమంతటా కోటానుకోట్లమంది క్రిస్టమస్ పండుగను ఎంతో వేడుకగా, భక్తి శ్రద్ధలతో చేసుకొంటారు. అది పావనమూర్తి ఏసుక్రీస్తు జన్మించిన రోజు. ఆయన అసలు పేరు 'జ్యోష్యు' ఆ పేరుకు అర్థం 'దైవమే (యహోవానే) ముక్తి' అని. అది గ్రీకు భాషలో 'జీసస్' అయింది. క్రీస్తు అన్నది ఆయన యొక్క దివ్యత్వాన్ని, అవతారకార్యాన్ని సూచించే బిరుదు. 'రక్షకుడు' లేక 'ముక్తి ప్రదాత' అని అర్థము. బైబిల్ లోని కొత్త నిబంధనను జాగ్రత్తగా పరిశీలిస్తే ఆయన చరిత్రను బట్టి, బోధను బట్టి ఆయన సద్గురువని తెలియగలదు.

సద్గురువులు హైందవ సాంప్రదాయం ప్రకారము రెండు రకాలుగా ఉంటారు. ఋషభుడు, శుకుడు, శ్రీపాదశ్రీవల్లభుడు, శిరిడీ సాయిబాబా ల వలె జన్మతః దివ్య స్వరూపులైనవారు కొందరు. సామాన్య మానవుల వలె జన్మించి, తీవ్ర సాధన వలన దివ్యత్వాన్ని పొందినవారు తాజుద్దీన్ బాబా, రామకృష్ణ పరమహంస వంటివారు కొందరు. మొదటి తెగకు చెందిన కపిలుడు, ఆది శంకరుడు వంటి వారిని అవతార పురుషులని హైందవ సాంప్రదాయం వ్యవహరిస్తుంది. అలా గాక మానవచరిత్రపై వారికిగల విస్తృత ప్రభావమును బట్టి కొందరిని అవతారాలుగా పరిగణించే సాంప్రదాయమూ ఉన్నది. ఏసుక్రీస్తు కూడ ఆ కోవకే చెందుతారు. అయితే తక్కిన మతాలను సహృదయతతో కూలంకుషంగా పరిశీలించని కొందరు క్రైస్తవ సోదరులకు ఈ నిర్వచనం నచ్చకపోవచ్చు. అట్టివారు క్రీస్తు ఒక్కరే భగవంతుని బిడ్డగా అవతరించిన భగవంతుడని, ఇతర మతాలకు చెందిన మహాత్ములందరూ సైతాన్ అనుయాయులని వాదిస్తారు. కాని బైబిల్ లోని క్రీస్తు చరిత్రను, బోధలను పరిశీలిస్తేగాని వాస్తవము తెలియదు. క్రీస్తు ఒక్కరే భగవంతుడని వాదించేవారు చెప్పే ఆధారాలను పరిశీలిద్దాము.

హిందూమతంలో వేదాంతులు పరమాత్మలో సత్, చిత్, ఆనందము అనీ, పౌరాణికులు బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు అనీ మూడు తత్వాలు గుర్తించినట్లే క్రైస్తవులు 'జగత్ పిత', 'పరిశుద్ధాత్మ, దివ్యపుత్రుడు' అనే – మూడు అంశాలను గుర్తించారు. జగత్ పిత పరలోకములో వుంటాడు. పరిశుద్ధాత్మ మానవులకు భగవంతుని గూర్చిన సత్యాన్ని అందిస్తుంది. దీని యొక్క మహిమ చేత అలౌకికమైన రీతిన మరియమ్మ



గర్భాన దివ్యపుత్రుడుగా జన్మించి మానవులకు 'ముక్తి' లేక 'పరలోక రాజ్యము' ను సాధించుకొనే మార్గాన్ని ఉపదేశించారు క్రీస్తు. యూదుల సాంద్రాయము ప్రకారము ఈ పరిశుద్ధాత్మే ప్రవక్తలందరిద్వారా మానవాళికి దివ్యసందేశాన్ని అందిస్తుంది. సర్వమతాలలోని మహాత్ములందరికీ యిది వర్తిస్తుంది.

క్రీస్తు యొక్క అలౌకిక జననము వలన ఆయన అద్వితీయుడని కొందరు వాదిస్తారు. కాని శిరిడీ సాయి తన జననము గూర్చి కూడా వారే "ప్రకృతిపురుషుల సంయోగము

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 డిసెంబర్ - 2024 సంచిక:08

***పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"***

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **ఏసు చెప్పిన మాట!** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 07 |
| 03. | **మనశ్శాంతి** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 09 |
| 04. | **మాతృదేవి స్మృతులు** | శ్రీమతి విజయలక్ష్మి | 13 |
| 05. | **పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ 86వ జయంతి వేడుకలు** | శ్రీమతి టి. పద్మావతి | 14 |
| 06. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 17 |
| 07. | **బుద్ధ ధ్యాన హృదయము** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 19 |
| 08. | **భగవాన్ శ్రీ భరద్వాజ** | శ్రీమతి శ్రీదేవి | 20 |
| 09. | **శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు** | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 10. | **ద్వారకామాయి అనుభవమండపము** | శ్రీమతి విజయలక్ష్మి | 23 |
| 11. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీ అంబటి శివాజీగణేషన్ | 26 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

**చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి**

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00

సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

వలన నాకు ఈ దేహము వచ్చినది" అని అన్నారు. తాము జన్మించినప్పుడు వారి తల్లి తనకు మగ బిడ్డ జన్మించినందుకు సంతోషిస్తుంటే, వారు మాత్రము, "నేను యిప్పుడు క్రొత్తగా జన్మించటమేమిటి? నేను ఇంతకుముందు నుండి వున్నాను గదా!" అనుకొన్నారట. తండ్రి ప్రసక్తి మాత్రము లేదు!! క్రీస్తు యూదులకు ఆదిపురుషుడైన అబ్రహామునకు పూర్వమే తాము వున్నట్లు చెప్పారు. అలానే సాయికూడా తాము రామాయణ కాలంలో వుండి ఆ వృత్తాంతము స్వయంగా చూచామని చెప్పారు. తమ వయస్సు లక్షల సంవత్సరాలు అని చెప్పారు. "నన్ను చూచిన వాడు జగత్ పితను చూచినట్లే" (యోహాను 14 : 8) అన్నారు క్రీస్తు. "నేను, దైవమూ ఒక్కటే" (మై అల్లాహుం) అన్నారు సాయి. జగత్ పిత సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు, కరుణామయుడు అయినట్లే క్రీస్తు కూడానని వారి చరిత్ర సూచిస్తుంది. శిరిడీ సాయి చరిత్ర కూడా వారిని గూర్చి అదే తెలుపుతుంది.

క్రీస్తు శిలువపై మరణించాక మూడు రోజులకు మరల భౌతిక దేహముతో తమ శిష్యులకు దర్శనము యివ్వగలగటము వలన క్రీస్తు అద్వితీయుడని క్రైస్తవుల వాదము. కాని 1886 సం॥లో శ్రీ సాయిబాబా ముందుగా భక్తులకు తెల్పి, మూడు రోజులపాటు మరణించి, తిరిగి సజీవులై భూమిపై 1918 వఱకూ జీవించారు. ఈ యిద్దరి సద్గురువుల చరిత్ర ఒక్కలాగే వుండటము గమనార్హం. అందుకే నేను రచించిన ఆంగ్ల సాయిబాబా జీవితచరిత్ర (Sai Baba The Master) గురించి అమెరికాలో ప్రఖ్యాత క్రైస్తవ తత్త్వవేత్త పాల్ రెప్స్ (Paul Reps) యిలా వ్రాశారు: "నాకుగాని, మరి యెవ్వరికిగాని, Sai Baba The Master చదువకుంటే జీసస్ జీవితము అర్థం చేసుకోవటం అసంభవము. శిరిడీ సాయిబాబా మహాత్ములందరిలోకి గొప్పవారు. ఈ గ్రంథాన్ని పాశ్చాత్య దేశాలలో ప్రచురించడము ఎంతో అవసరము."

క్రీస్తు యొక్క జననాన్ని గూర్చి ఎందరో ప్రవక్తలు ముందుగానే "జగద్రక్షకుడు అవతరించబోతాడు" అని చెప్పినట్లు బైబిలులోని పాత నిబంధనలలో పలుచోట్ల గ్రంథస్థమై వున్నదని; కనుక ఆయన ఒక్కడే భూమిపైన అవతరించిన భగవంతుడని క్రైస్తవులు అంటారు. ఇట్టి ఆధారాలు ప్రత్యేకంగా మత్తయి సువార్తలో (The Gospel of Mathew) లో ఎక్కువ భాగం కనిపిస్తాయి. ఆ సువార్తమీద అధికారికమైన వ్యాఖ్యను వ్రాసిన విలియమ్ బార్క్లే (William Barclay) గ్రంథం చూస్తే వాస్తవము తెలుస్తుంది. "క్రీస్తు యొక్క భక్తుడూ, ప్రచారకుడూ అయిన "మత్తయి" (Mathew) యూదు జాతికి చెందినవాడు. సాటి యూదులచేత క్రీస్తు భగవంతుని పుత్రుడైన జగద్రక్షకుడని నమ్మించాలన్న ఆతృతతో పాతనిబంధనలోని ప్రవక్తల వాక్యాలను వక్రీకరించి, అవి వాస్తవంగా క్రీస్తు జననానికి సంబంధించనవి అయినప్పటికీ ఆ రకంగా చిత్రించి మత్తయి కల్పన చేశాడు" అని బార్క్లేసోదాహరణముగా వివరించారు. కనుక ఈ వాదము సరియైనది కాదు.

ఇక క్రీస్తు శ్రీ శిరిడీ సాయిబాబా వంటి సద్గురువనటానికి కొద్ది ఉదాహరణలు :

1. ఉత్తముడైన సద్గురువు తాను ఆజన్మ సిద్ధుడైనప్పటికి, మానవులందరికీ ఆదర్శాన్ని చూపించడానికి, సత్సాంప్రదాయాన్ని గౌరవించటానికి, ఒక గురువును ఆశ్రయిస్తాడు. శ్రీకృష్ణుడు సంపూర్ణ భగవదావతారమైనప్పటికీ సాందీపని మహర్షికి శిష్యుడయ్యాడు. క్రీస్తు యోహాను (John) అను ప్రవక్తకు శిష్యుడై 'బాప్టిజమ్' (ఉపదేశము) పొందారు. తామొక సద్గురువును 12సం॥ దీక్షగా సేవించి వారి అనుగ్రహాన్ని పొందినట్లు శ్రీ సాయిబాబా కూడా చెప్పారు.

2. తీవ్రమైన సాధన ద్వారా సర్వమూ తానే అయిన భగవంతుడూ తామూ వేరుగాదన్న జ్ఞానాన్ని పొందినవాడే సద్గురువు, భగవంతునికి వలెనే సద్గురువుకు కూడ తానుకానిదేదీ వుండదు కనుక అద్వితీయుడు. అట్టి స్థితిని జన్మతః కల్గియున్నవాడు "జన్మతః భగవంతుని దివ్య పుత్రుడు" (The only begotten Son of God). అట్టి స్థితిగల సిద్ధపురుషులు భౌతికంగా ఎందరున్నా ఆంతర్యంలో వారంతా ఐక్యత కల్గియుంటారని శ్రీసాయిబాబా చరిత్ర చూస్తే తెలుస్తుంది. కనుక వారిలో ప్రతి ఒక్కరూ తమ తమ భక్తులకు 'నా ద్వారా తప్ప భగవంతుని ఎవ్వరూ చేరలేరు' అంటారు. వారి భక్తులలో మూఢులైనవారు యీ తత్వాన్ని అర్థం చేసుకొనక "నా సద్గురువొక్కడే దైవము; మిగిలినవారు కారు" అని తగవులాడుకొంటారు. ఇదే మనకీనాడు కన్పించే పరమత దూషణకు కారణం. ఈ భావం మౌఢ్యమనడానికి ఋజువు వారందరి బోధలూ ఒకే తీరుగా వుండడమే. అన్ని మతాల మూలసూత్రాలూ ఒకే రీతిగా వున్నప్పుడు యితర మతాలకు చెందినవారు పాపులని, తమ మతమొక్కటే సత్యమనీ వాదించడమెలా రైటవుతుంది? అన్ని మతాల

లోనూ వున్న ప్రధాన సూత్రాలను త్రికరణశుద్ధిగా పాటించక, బాహ్యాండంబర మొక్కటే కల్గియుండి, నిత్యజీవితంలో నైతిక ధర్మాలను పాటించని వారందరూ పాపులే. ఆ విషయం క్రీస్తు చెప్పినదానిలో స్పష్టమవుతుంది. తన భక్తులమని చెప్పుకొంటూ, తననామాన్నుచ్చరిస్తూ గూడ తాను చెప్పిన ధర్మసూత్రాలను పాటించని వారిని తాను రక్షించనని, వారికి నరకమే గతియనీ క్రీస్తు చెప్పారు. అందుకే వారు చెప్పిన 'స్వామి ప్రార్థన' (The Lord's Prayer) లో క్రైస్తవమతానికీ, క్రీస్తుకూ పరిమితమైన పదమొక్కటి గూడా లేదు!

3. పైన చెప్పినట్లు తామే సర్వమూ అయిన భగవంతుడనని చెప్పిన ప్రతి సద్గురువూ నిజమైన శిష్యులను తమవంటి సద్గురువులుగా రూపొందిస్తారు!! (ఆత్మ తుల్యాన్ కరోతి'). క్రైస్తవ పదజాలంలో చెప్పాలంటే దేవుని బిడ్డలుగా రూపొందిస్తారు. అట్టి స్థితినే ఆయన పరలోక రాజ్యమన్నారని మత్తయి సువార్త బార్క్లే పండితుడి వాఖ్య చూస్తే తెలుస్తుంది. తానొక్కడే భగవంతుని వంటి పరిపూర్ణుడనని క్రీస్తు చెప్పలేదు. క్రైస్తవులనుకున్నట్లు. తన శిష్యులందరినీ అంతటి పరిపూర్ణులవ్వమని చెప్పాడు; భగవంతుని దివ్యపుత్రులవ్వమన్నారు (మత్తయి సువార్త 4:43 నుండి 48). ప్రతి మతంలోని సద్గురువూ సాయి, క్రీస్తులవలే తమ శిష్యులెందరినో – అర్హులైన వారిని – అలాచేశారు. అలా రూపొందిన శిష్యులతో "మీరు ప్రపంచానికి వెలుగులవ్వాలి" (మత్తయి 4 : 14 లో) అన్నారు. అటువంటప్పుడు క్రీస్తుతప్ప అన్యులెవరూ 'భగవంతుని బిడ్డలు', 'భగవత్స్వరూపులు', మానవాళికి మార్గదర్శకులు కారని వాదించే పామర క్రైస్తవ ప్రచారకులమాట నమ్మాలా? లేక క్రీస్తు మాటలు నమ్మాలా? క్రీస్తు బోధలకు భిన్నంగా మత ప్రచారం ఆయన పేరిట చేసేవారు సైతాను అనుయాయులా, లేక వాటికి సరిపోవులాగున బోధించి, ఆచరించి తరించిన యితర మతాలలోని సద్గురువులు, యీ సత్యాన్ని తెలిపిన వారి భక్తులూ సైతాను అనుయాయులా?

క్రీస్తు సాంప్రదాయకమైన యూదు కుటుంబంలో జన్మించారు. శాశ్వతమూ, దివ్యమూ అయిన యూదుధర్మాన్ని తాను వమ్ముచేయమని, వాటిని పరిపూర్ణం చేయడానికే అవతరించామని చెప్పారు (మత్తయి 5:17–20). కాని ఎన్నో యూదుసాంప్రదాయాలను ఆయన ఆచరణలో తృణీకరించడం చరిత్రలో చూడవచ్చు. అంటే మూఢమైన బాహ్యాడంబరాన్ని ఆయన నిరసించారు. ధర్మం యొక్క నిజతత్త్వాన్ని బలపరచారు. శ్రీసాయిబాబా అలానే చేసిన వివరం శ్రీసాయిబాబా జీవిత చరిత్ర లోని 'సాయి సాంప్రదాయం' అన్న అధ్యాయంలో చూడవచ్చు. అంటే ఇద్దరూ నిత్యజీవితంలో పరిణితి తెచ్చుకోవడం ఆవశ్యకమనే ధర్మస్వరూపాన్ని తెల్పిన సద్గురువులు. అంతేకాదు, ప్రార్థన ఎలా చేయాలో క్రీస్తు బోధించి ముక్తి మార్గాన్ని తెల్పారు. సాయి కూడా తెల్పారు. సాయి తెల్పిన దానిలో "నా ద్వారా తప్ప భగవంతుని ఎవ్వరూ చేరలేరు" అని క్రీస్తు వంటి సద్గురువులు చెప్పేదానికి అసలైన అర్థం బోధపడుతుంది. ఇద్దరూ ముక్తి మార్గ బోధకులైన పరమ గురువులు. ఇద్దరూ శిష్యులకు ఆధ్యాత్మికానుభూతిని సంకల్పమాత్రం చేత ప్రసాదించగల వారేనని వారిచరిత్రలు నిరూపిస్తున్నాయి. ఇద్దరూ అస్ఖలిత బ్రహ్మచారులు. ఇల్లు, వాకిలి, ధనము లేకుండా, రేపటికని దాచుకోకుండా జీవించారు. కష్టాలతోను, రోగాలతోను బాధపడుతున్న వారి బాధలను బాపారు. క్రీస్తుకూడా సాయివంటి సద్గురువే. ఇద్దరూ మత మౌఢ్యాన్ని వ్యతిరేకించారు.

"ఎండ, నీరు, పాపులకు పవిత్రులకూ దైవం సమానంగానే యిస్తున్నారు" (మత్తయి 5 : 43–48) అన్నారు క్రీస్తు. అలా అన్ని దేశాల, జాతుల, మతాల వారికీ వీటిని ప్రసాదిస్తున్న దైవం ఆధ్యాత్మిక జ్ఞానం మాత్రం అయా మతప్రవక్తల ద్వారా వారికి అందజేయరా? "రొట్టెనర్థించే బిడ్డకు రాయినిచ్చే తండ్రి వుండడు" అని క్రీస్తు అనలేదా? అటువంటప్పుడు యితర మతస్తులందరూ పాపులని బొబ్బలు పెట్టేవారికి క్రీస్తు చెప్పినదేమి తెలిసినట్లు? "సాటివానిని 'తెలివితక్కువవాడా!' అని నిందించినాసరే నరకానికి పోతావు!!" అని క్రీస్తు చెబుతుంటే, పై సత్యాన్ని మరచి యితర మతస్తులను నిందించేవారేమవుతారు? "ఒక చెంప కొడితే యింకొక చెంప యివ్వ"మని ఆయన చెబితే తామే యితర మతాలను నిరసించడానికి పూనుకున్నవారు అయన చెప్పిన మార్గాన్ననుసరించిన వారెలా అవుతారు? ఇన్ని సత్యాలూ క్రీస్తుకు ప్రతిరూపమనిపించే సాయి జీవితంలో పూర్ణంగా ప్రతిబింబించాయి. పాల్ రెప్స్ వ్రాసినట్లు సాయి చరిత్ర చదివి; క్రీస్తు చరిత్ర, బోధలను సరిగా అర్థం చేసుకొని రానున్న క్రిస్మస్ నాడైనా మీ హృదయాలలో నిజమైన క్రీస్తును జనింపచేసుకోండి. "విష్ యూ ఎ హోలీ క్రిస్మస్!" ●


# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

**ప్రశ్న :- మాకొక అర్జంటైన ధర్మసందేహ మొచ్చింది. నేనూ నా స్నేహితులూ సాయి సుప్రభాత్ క్యాసెట్లు తెప్పించుకొన్నాము. మా దగ్గరకెందరో వచ్చి "మేము ఖాళీ క్యాసెట్లు తెచ్చుకొని మీ వద్ద నున్న సుప్రభాతమ్ రికార్డు చేసుకొంటాము" అంటున్నారు. 'అది కూడ ఒక సేవే గదా! చేసుకోవచ్చంటారు వారు. నాకెందుకో అది అధర్మమనిపిస్తుంది గాని ఎందుకనో వివరించలేకున్నాను. మాకు వెంటనే పత్రిక ద్వారా సమాధానమివ్వగోరుతున్నాము'.**

– కె.పి. రావు, మల్కాజిగిరి

**జవాబు :-** 'ఎవరి సేవనూ ఉచితంగా తీసుకోకూడదు' అన్నది సాయి చెప్పిన ముఖ్యధర్మసూత్రం. చెట్టుకు నీరు, ఎరువు, కంచెవేసి కాయలు తీసుకొంటున్నాము. పశువుకు మేత వేసి సంరక్షించి పాలు తీసుకుంటాము. వ్యవసాయం చేసి పంట తీసుకుంటాము. అలానే సుప్రభాతాన్ని కూర్చి 'మాస్టర్ క్యాసెట్లు' తయారు చేయడానికే ప్రచారసంస్థ కెంతో వ్యయప్రయాసలయ్యాయి. దీనిని తీసుకొని వినియోగించుకోగోరేవారందరూ ఆ కృషికి తగిన విలువ చెల్లించి దానిని పొందడం ధర్మం. సాయి చెప్పిన యీ దివ్యదృష్టి సూత్రమైన ధర్మాన్ని ఉల్లంఘించాక యిక అర్థకామాలు గాని, మోక్షంగాని సిద్ధించే ప్రసక్తేలేదు. కనుక ఉచితంగా క్యాసెట్లు రికార్డు చేసుకొనడం దొంగతనమవుతుంది. సాయి భక్తికి దొంగతనంగా



వ్యక్తమవడం చాలా ఏహ్యం. సమాజానికి ధర్మ ప్రచార సాధనంగా ఎన్నో సంవత్సరాల కృషితో, ఎందరో భక్తుల త్యాగపూరితమైనసహకారంతోమరింతగాధర్మప్రచారానికి దోహదమివ్వాలని రూపొందించబడిన క్యాసెట్టును కేవలం 10 లేక 20 రూపాయలకోసం కక్కుర్తిపడి ఉచితంగా రికార్డు చేసుకోవడమంత అధర్మం మరొకటి వుండదేమో. ప్రతి భక్తుడూ కనీసం క్యాసెట్టు విలువనైనా ప్రచార సంస్థకు విరాళంగా చెల్లించి తీసుకుంటే అంతటి వ్యయ ప్రయాసలతో గూడిన ధర్మకార్యానికి పూనుకొన్న సంస్థకు దెబ్బతగులకుండా చూచినవారమవుతాము. అలాగాక ఆ కొద్దికీ లోభించి ఉచితంగా రికార్డింగ్ చేసుకొంటే అది చౌర్యమే అవుతుంది. అది నిత్యమూ వింటున్నా మనలోని అధర్మ సంస్కారాలే బలపడతాయి. సాయి చెప్పిన ధర్మసూత్రాన్ని ఉల్లంఘించే దుష్ట సంస్కారాలే బలపడతాయి. ఇక సాయిభక్తులమయివుండి చౌర్యంతో మనభక్తి పరాకాష్ట చెందకూడదు. ఉచితంగా సాటివారికి సుప్రభాతాన్ని లభించేలా చేయాలన్నది ధర్మమే కావచ్చు. కాని దానికైన వ్యయప్రయాసలు యింకొకరివై, వారు నష్టబోయేదిగా వుండేది దానమవదు. మనింట్లో బియ్యం యింకొకరు దానం చేస్తే దానిని మనం హర్షిస్తామా? మనం శక్తి కొలది బియ్యం కొని దానం చేయాలి. ఆ కొనే ధనంకూడ ధర్మబద్ధమైనది కావాలి. అది కూడ అలా యింకొకరి జేబు కొట్టినదిగాగూడదు. అధర్మ ప్రవృత్తి గల వారి వద్ద దక్షిణ తీసుకోడానికి సాయి ఎలా నిరాకరించారో చదివాము గదా? మన మందరమూ బాధగా విమర్శించుకొన్నట్లు మనం గూడ సాయిభక్తి విద్రోహకరమైన చర్యగా, చౌర్యంగా మార్చడం వాంఛనీయంగాదు. ఇంత ఆలోచించాక యిదివరకే ఈ పొరపాటు చేసిన వారు తాము పొరపాటును దిద్దుకోవచ్చు. వివిధ దేవతలకు మొక్కుకొని, చెల్లించవలసినది చెల్లించనివారి వద్ద ఎంత కాలానికైనా సాయి అడిగి తీసుకొనేవారు. అలా చెల్లించకుండా వుండకూడదన్నారు. అదే మన ధర్మ సూత్రం. ఒక వంక భిక్షువులకు భిక్ష వేస్తూ, శిరిడీ యాత్రతోపాటు నిత్య జీవితంలో మోసాలకు, సినిమా, కాఫీ, టీల వంటి వాటికీ, టేపురికార్డరు వంటి వాటికి ఖర్చుచేస్తూ ఒక్క యిలాంటి ధార్మికమైన విషయంలో యిలాటి కృపణత్వం (కక్కుర్తి) మన సాయి భక్తి, ధర్మచింతన, మన సద్వర్తన, సద్భావమూ ఎంతటివో తెల్పుతాయి. ●

---

## ప్రశ్న :- మహనీయులు నిర్యాణం చెందిన తర్వాత వారి శరీరం పవిత్రమైనదేనా ?

**- ఆర్. భారతీదేవి, చీరాల**

**జవాబు :-** 'మహనీయులు 'మరణించాక' గూడ వారి దేహాలు పరమ పవిత్రమైనవే. అందుకే జీవన్ముక్తుల దేహాలను దహనం చేయక సమాధిచేసి, దానిని పరమపవిత్రంగా పూజించడమన్నది అన్ని మతాల ఆచారంగా వున్నది. ఇది కేవలమొక విశ్వాసం మాత్రమే గాదు. ఆ సన్నిధిలో మానవుని ప్రార్థనలు భగవంతుని నుండి అనుగ్రహాన్ని త్వరగా పొందుతామన్నది నిస్సందేహం, అన్ని మతాలకు చెందిన వేలాది ప్రజల అనుభవం గూడ. కొన్ని శతాబ్దాల క్రింద పరమపదించిన మహనీయుల సమాధుల వద్ద - శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి, మంత్రాలయ రాఘవేంద్రుల సమాధి, నాగూరవల్లి సమాధి యిలా యెన్నో వివిధ ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో ఆ సన్నిధిలో సాధకులు తీవ్ర సాధనలు ప్రత్యేక భగవదాదేశం పొంది దాని సహాయంతో వారు గూడ పూర్ణ పురుషులుగా రూపొందిన విషయం చరిత్రలో చూడవచ్చు. ఏదో ఒక శుభసమయంలో ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠలతో మానవులు మలచిన విగ్రహాలు శక్తివంతాలవుతాయని శాస్త్రం చెబుతుంటే జీవితాంతమూ భగవధ్యానంతో అణువణువూ పవిత్రమై, వారనుభవించిన భగవద్దైక్యంలో పరమపావనమైన మహనీయుల సమాధులు, చిరకాలం శక్తివంతాలవడంలో ఆశ్చర్యమేమున్నది? ఎందరో అవిశ్వాసులకు గూడ పరివర్తన కల్గించగల్గిన ప్రభావం అక్కడ ప్రకటమైన వుదాంతాలెన్నో! ●

(సెప్టెంబరు 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)

# మనశ్శాంతి

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

మనశ్శాంతి - ప్రస్తుత కాలంలో మన మనస్సుకు అందని మాట. అది మనకు ఎండమావిలాంటిదే. ఏ కొంచెమో, ఎప్పుడో వున్నా అది ఎడారిలో ఒయాసిస్సులాంటిదేనని చెప్పవచ్చు. ఈ రోజుల్లో ఎవరిని కదిలించినా మనశ్శాంతి లేదనేవారే. అందుకు అనేక కారణాలు, ఎవరి కారణాలు వారివి. అయితే అసలు మనకు మనశ్శాంతి లేకపోవడానికి కారణం ఏమిటి? మనం మనసున్నవారిమవడం వల్లనా? లేక మనసులేనివారమవడం వల్లనా? ఆలోచిస్తే ఈ రెండూ గూడ కారణాలేనని చెప్పుకోవచ్చు.

నిద్ర లేచింది మొదలు మనం ఎటువంటి పనులు చేస్తున్నాము, ఎటువంటి ఆలోచనలు చేస్తున్నాము అన్నదాని మీద మన మానసిక స్థితి ఆధారపడి వుంటుంది. మన శారీరక పరిస్థితిని బట్టి, చుట్టు ప్రక్కల వున్న పరిస్థితిని బట్టి గూడ మన మానసిక స్థితి ఆధారపడి వుండడం గూడ కొంతవరకూ సమంజసమే. అయినప్పటికీ పూర్తిగా అట్టి పరిస్థితులు మాత్రం మన మానసిక స్థితికి కారణాలు కావు. ఎందుకంటే పరిస్థితులను బట్టి మనస్సు వుండడమన్నది ఒక కారణం మాత్రమే. మానసికస్థితిని బట్టి పరిస్థితులను గూర్చి ఆలోచించడం మాత్రమే జరుగుతుంది. ఒకే పరిస్థితిలో వున్న ఇద్దరు వ్యక్తుల మానసికస్థితి రెండు రకాలుగా వుంటుంది.

ఇతరులు మనపట్ల మనస్సులేనివారుగా అంటే మన ఉద్దేశ్యంలో మంచి మనస్సు లేనివారుగా వుండడం వల్ల మనశ్శాంతిని కోల్పోతున్నట్లు మనకనిపిస్తుంది. అంటే ఇతరులు మనస్సులేనివారుగా మనకు అనిపిస్తారు, కనిపిస్తారు గూడ. కానీ మనం ఇతరుల పట్ల మనస్సులేని వారముగా వున్నట్లు ఇతరులకు అనిపిస్తున్నది. కాబట్టి మనం మనపట్ల (మంచి) మనస్సున్నవారము, ఇతరులకు (మంచి) మనసులేనివారమూ గూడ. అయితే ఈ రెండింటికీ మనం చెప్పుకునే కారణాలు ఎంతవరకు వాస్తవం?

ఉదాహరణకు మనతో ఒకడు అనవసరంగా తగవు పెట్టుకుంటున్నాడనుకుందాము. అది కేవలం మన దృష్టిలో మాత్రమే వాడిది చెడు ప్రవర్తన. కానీ అవతలివాడి దృష్టిలో వాడు మనతో తగవు పెట్టుకోవడం సరియైనదేననుకుంటున్నాడు. మనం సరియైన వాళ్ళముకాము అంటే మంచి మనసులేనివాళ్ళము గనుక అతడు (మంచి) మనసు కలవాడు గనుక అతడు తగవు పెట్టుకోవడం చాలా సరియైన, అంటే ధర్మబద్ధమైన చర్య అని అతడు అనుకుంటున్నాడు. అయితే మనవైపు నుంచి మాత్రం మనము చేసినదే ధర్మబద్ధమైనది.

నిజంగా చెప్పాలంటే మనకు మనశ్శాంతి లేదంటే మనం (మంచి) మనసున్న వాళ్ళముకాము అనే చెప్పాలి.

అదేమిటి? మనం మంచి పనులే చేస్తున్నాము గదా



కానీ అవతలివాడు అర్థం చేసుకోకనో లేక స్వార్థం వల్లనో, అసూయాద్వేషాల వల్లనో మనకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నప్పుడు మనం (మంచి) మనసున్న వాళ్ళము ఎందుకు కాము? అని మనకనిపించవచ్చు.

ఇందుకు సరియైన సమాధానం మన పెద్దలు అంటే మంచి మనసున్నవాళ్ళు ఏం చెప్పారో తెలుసుకుంటే మన మనస్సు యొక్క పరిస్థితి ఏమిటో, మనమెలాంటి వాళ్ళమో మనకర్థమవుతుంది.

మనం చేసే పనులకు మనము ఇతరుల నుంచీ ఆశించేదాని మీద మన మనస్సు యొక్క స్థితి ఆధారపడుతుంది. అంటే మనం ఒక పని చేస్తే, దాని పట్ల అతని మాట, ప్రవర్తన ఎలా వుంటుందో దానిని బట్టి మన మనస్సు శాంతిగా వుండడము, లేకపోవడము వుంటుందన్నమాట. అవతలివాడు మనలను మెచ్చుకుంటే, పొగిడితే మనకు సంతోషము, లేకపోతే కోపద్వేష అసూయాదిభావాలు మన మనస్సు పొందుతుందన్నమాట. అంటే మన మనస్సు శాంతిగా వుండడానికి మనం చేసే పనులుగాని మనలను యితరులు ఏమనుకుంటున్నారు అన్నదాని మీద ఆధారపడుతుందన్నమాట. మన పనులు కొందరికి నచ్చుతాయి, మరికొందరికి నచ్చవు. అది వారి స్వభావాలను బట్టి వుంటుంది. కనుక అందరూ మనలను మెచ్చుకోవడం ఎన్నటికీ జరుగదు కనుక మనకు మనశ్శాంతి వుండానికి అవకాశం లేదు.

ఒక్కొక్కసారి మనం చేసిన పనులకు మనశ్శాంతి వున్నట్లు కనిపించినా అది తాత్కాలికంగానే వుంటుంది. ఏదో కారణంగా మళ్ళీ మొదలే. అలాగాక కొందరికి వాళ్ళు చేసిన పనులవల్ల వాళ్ళకు గూడ మనశ్శాంతి వుండదు. ఉదాహరణకు ఒకడు మరొకరి పట్ల అసూయద్వేషాలతో దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నాడనుకుందాము. అతడు తాను చేసే పనులవల్ల తనకు మనశ్శాంతి వస్తుందని అనుకుంటాడు. కానీ శాంతి అసలే వుండదన్న సంగతి అతనికే తెలియదు. కారణం అతడు చేసిన పనులవల్ల బాధపడిన వాళ్ళు ప్రతీకారం అతని మీద తీర్చుకోవాలి అనుకుంటారు గనుక. వారు అట్టి ప్రతీకారం తీర్చుకోవడానికి వీలులేకుండాను, లేక వాళ్ళ ప్రతీకారానికి మళ్ళీ ప్రతీకారం తీర్చుకోవడానికి పన్నాగాలు పన్నడంలోను నిమగ్నమవుతుంటాడు. ఇలాంటి ఆలోచనలు, చర్యల వల్ల మనశ్శాంతిని అతడు పూర్తిగా కోల్పోవడం జరుగుతుంది.

అలాగాక జీవితంలో సంతోషించే సమయాలు, అంటే మనశ్శాంతి లభించే సమయాలు, సందర్భాలు కూడ వుంటాయి గదా అని మనకనిపించవచ్చు. ఉదాహరణకు మనింట్లో ఒక పుట్టినరోజు, లేక ఒక శుభకార్యం జరిగిదనుకుందాము లేక మన అమ్మాయో, అబ్బాయో అమెరికా వెళ్తున్నాడనుకుందాము. అప్పుడు మన మనస్సు శాంతిగానే వుంటుందిగదా అని అనిపించవచ్చు. కానీ సరిగ్గా ఆలోచిస్తే అప్పుడు గూడ మనస్సు పూర్తి శాంతిని పొందలేదు. కారణం పరిస్థితుల ప్రభావము, ఇతరులు మనపట్ల ప్రవర్తించే తీరు మన మనస్సు పైబడి ఆ కాస్త సంతోషాన్ని గూడ పొందనివ్వక మనశ్శాంతి లేకుండా చేస్తాయి. ఇది మనం గమనిస్తే తెలుస్తుంది. ఏ శుభ సమయంలోనూ గూడ మనం పూర్తి మనశ్శాంతిని పొందలేము.

అందుకనే పెద్దలు ఏం చెప్పారంటే మన కోరికలే మనకు మనశ్శాంతి లేకపోవడానికి కారణం అని. ఇక్కడ కోరిక అంటే కావాలనే కోరిక మాత్రమే గాదు, వద్దు అనే

కోరికకూడా. మనము దేనినైనా కావాలి, వద్దు అనేదాని మీదనే ఆధారపడి చేస్తుంటాము. ఇట్లా జరగాలి, ఇట్లా జరగకూడదు, ఇట్లా మాట్లాడాలి, ఇట్లా మాట్లాడకూడదు; ఇలా వుండాలి, ఇలా వుండకూడదు అనేది మన విషయంలోనేగాక అవతలి వాళ్లు గూడ మన యిష్ట ప్రకారమే వుండాలని కోరుకుంటాము. అక్కడే వస్తుంది పెద్ద చిక్కు. మన ఇష్టపకారం మనం వుండాలనుకోవడం కొన్ని విషయాలలో, కొంతవరకూ సమంజసమే అయినప్పటికీ అవతలివాళ్ళు గూడ మన ఇష్ట ప్రకారమే వుండాలనుకోవడం ఏమిటి? మనం అవతలి వాళ్ల ఇష్ట ప్రకారం ప్రవర్తించగలమా? కొన్ని విషయాలలో అవతలివాళ్ళ ఇష్ట ప్రకారం గూడ మనం ప్రవర్తిసాముగదా అని కొందరికి అనిపించవచ్చు. ఇక్కడ ఒక తమాషా వున్నది. మనం ఇతరులకు ఇష్టమైన పని చేసినప్పటికీ వారికి ఇష్టమైన పని చేయడం మనకిష్టంగాబట్టి మాత్రమే చేస్తాము. లేకుంటే ఇష్టంగా చేయము. ఇష్టం లేకుండానే చేస్తాము.

ఇవన్నీగాక మనస్సుకు ఒక గుణమున్నది. అది మన ప్రమేయం లేకుండానే దానికై అదే ఎన్నెన్నో చేస్తుంటుంది. ఆ ప్రవాహం గాఢనిద్ర పోయేటప్పుడు తప్పితే ఆగదు. అది చేసే ఆలోచనల వల్లే మనకు మనశ్శాంతి వుండడము, లేకపోవడము జరుగుతుంటుంది. అయితే ఈ రోజులలో ఎవరికీ మనశ్శాంతి లేకపోవడానికి కారణమేమిటి? అంటే సమాజంలో ఎక్కువమందిలో స్వార్థం పెరిగిపోవడమే ముఖ్యకారణమని చెప్పవచ్చు. చిన్న విషయాల దగ్గర నుంచి పెద్ద విషయాలదాకా తనకిష్టమైనట్టే జరగాలనుకోవడము, తను కావాలనుకున్నట్లే జరగాలని అనుకోవడము, తానే బాగుపడాలన్న కాంక్షల వల్ల, ఇతరులు అందుకు వ్యతిరేకంగా వుండడం వల్ల సహించలేని తత్త్వమేర్పడి పర్యవసానంగా తనకు, అవతలివారికీ మనశ్శాంతి లేకుండా చేయడం జరుగుతున్నది. ఇక దీనికి అంతెక్కడ?

అలాగాక ఎటువంటి పరిస్థితులలోనైనా మనశ్శాంతిగా వుండగలవారు నిజంగా (మంచి) మనసు కలవారు, మనసులేనివారు గూడ. వారు వివేకంతో ఆలోచించి ప్రతి విషయాన్నీ అనుకూలంగా తీసుకుంటారు. ఉపయోగించుకుంటారు గూడ. మనలాగే అవతలివాళ్ళకూ ఇష్టాయిష్టాలు వుంటాయని; మనకు ఎలాగైతే కొన్ని విషయాలు నచ్చడము, నచ్చకపోవడము వుంటాయో, అలాగే అవతలి వాళ్ళకు గూడ వుంటాయని అనుకుంటారు గనుక వాళ్ళు అవతలి వాళ్ళ అభిప్రాయాలమీద ఆధారపడరు. పెద్దలు చెప్పినట్లు ఆచరిస్తున్నామా లేదా అన్నదాని మీదనే ఏదైనా చేస్తూంటారు. కనుక వారు (మంచి) మనసు కలవారు. రెండవది వారి మనస్సు వారి చెంత వుండదు. గురువుకు లేక భగవంతునికి అర్పించివుంటారు గనుక వారు మనసులేనివారు కూడ.

అయితే వారు ఏ పరిస్థితులలోనైనా మనశ్శాంతిగా ఎలా వుండగలిగారు? ఏ విధంగా ఆలోచించి, ఏ విధంగా ప్రవర్తిస్తే అలా వుండగలిగారు? లేక వారి మనస్సు గురువు యందుగాని, భగవంతుని యందుగాని సంపూర్ణంగా ఎలా సమర్పించుకోగలిగారు? వీటికి సమాధానం మహాత్ములే అయినప్పటికీ మహాత్ములందరూ అలా అనిపించరు. వారు పరిపూర్ణులుగా వుంటారు గనుక, అంటే వారి సాధన పూర్తయిపోయి వుంటుంది గనుక వారు అలా అనిపించరు, కనిపించరు. కానీ కొందరు పై విషయాలకు ఆదర్శ ప్రాయంగా లేక నిరూపణగా మనకు కనిపిస్తారు. అటువంటి వారిలో శ్రేష్ఠులు పూజ్యశ్రీ మాస్టరుగారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఎటువంటి పరిస్థితులలోనైనా మనశ్శాంతిగా ఎలా వుండగలిగారు? అంటే ఆ విషయం ఆయనను గమనించిన వారికెవరికైనా స్పష్టంగా తెలుస్తుంది. ఆయనకు బాబా అనుగ్రహం సంపూర్ణంగా కలిగింది. కనుక ఆయన అలా వుండగలిగారు అని మనం సమాధానపడవచ్చు. కానీ అట్టి అనుగ్రహం పొందగలగడానికి ఆయన అంతకుముందు చేసిన సాధనే కారణమని చెప్పక తప్పదు. అసలీ అశాంతి ఎక్కడనుండి వస్తున్నది? ఎలా వస్తున్నది? అని ప్రశ్నించుకుని, పరిశోధించి, అది మనలోనే వున్నదని తెలుసుకుని, దానికి పరిష్కార మార్గాన్ని కనుగొన్నవారే బుద్ధుడు మొదలైన మహాత్ములు. పూజ్యశీ మాస్టరుగారు గూడ అలాగే అన్వేషించి కనుగొన్నారు. అంతేగాక జీవితంలో అనుక్షణమూ జరిగే సంఘటనల పట్ల ఆయన ఆలోచనా విధానం విశిష్టమైనది.

ఆధ్యాత్మికానుభూతి పొందిన వారిలో చాలామంది యొక్క ఆలోచనా విధానం పరిస్థితుల పట్ల ఒకరకంగా వుండడమే చూస్తాము. వారు ఏ పరిస్థితులూ పట్టించుకోరు. కారణం వారు నిరంతరం ఆధ్యాత్మిక చింతనలో వుంటారు. కనుక వారిపై పరిస్థితుల ప్రభావం వుండదు. కనుక వారికి మనశ్శాంతికి కొదవ వుండదు. ఏ ఆటంకమూ రాదు.

అలాగాక మనశ్శాంతి లేని సామాన్య ప్రజలు పరిస్థితుల ప్రభావం వల్ల మనశ్శాంతిని కోల్పోకుండా వుండడానికి ఎలా ఆలోచించాలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఆచరించి చూపారు.

మనశ్శాంతికి పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పే బ్రహ్మాస్త్రం – 'ఏమైంది?' అనుకోమని. "ఇప్పుడు ఏమైంది? ఇలా జరిగితే ఏమి?" అనుకోమని చెప్పేవారు. ఎట్టి పరిస్థితులలోనైనా యిప్పుడు యిలా జరిగితే ఏమైంది అని ఆలోచించడం వల్ల మనశ్శాంతి పొందగలమని ఆయన చెప్పేవారు.

ఉదాహరణకు మన మీద విమర్శలు వస్తూ వుండవచ్చు. ఎందరో ఎన్నో అనుకుంటూ వుండవచ్చు. అవి మనకు మనశ్శాంతి లేకుండా చేయవచ్చు. అప్పుడు 'వాళ్ళు అలా అనుకుంటే మనకు ఏమైంది? అవి మనకేమీ గుచ్చుకోవుగదా. వాళ్ళకు మనమీద అటువంటి అభిప్రాయం వున్నది గనుక అలా అనుకుంటున్నారు' అని అనుకుంటే మనశ్శాంతి వుంటుందని చెప్పేవారు. ఒకవేళ అందువల్ల మనకు లౌకికంగా ఏదైనా యిబ్బంది వస్తే ఆ యిబ్బందిని అతిక్రమించడానికి ప్రయత్నించవచ్చు.

కానీ మనశ్శాంతిని మాత్రం కోల్పోకూడదు అని చెప్పేవారు.

అలాగాక కొందరిని ఇంట్లోని వ్యక్తులుగాని, ఆఫీసులోని వ్యక్తులు గానీ లేక యితరులెవరైనా గానీ నిరంతరం సాధిస్తూ, ఎన్నో రకాలుగా యిబ్బంది పెడుతూ వుండవచ్చు. అప్పుడు ఆ పరిస్థితులనుంచి తప్పుకోవడానికి ప్రయత్నించవచ్చు. ఒకవేళ అట్టి పరిస్థితులనుంచి తప్పుకోడానికి వీలేలేని పరిస్థితులలో 'ఇది మన పూర్వకర్మ వలన వచ్చింది. దీనిని ఓర్పుతో అనుభవించేస్తే సరిపోతుంది అని భావించి భగవన్నామస్మరణ ఎక్కువగా చేసుకోవాలి. ఆ పరిస్థితిని మెరుగుపరచమని భగవంతుని ప్రార్థించవచ్చు గూడ' అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు.

మనం ప్రతిరోజూ అతి చిన్న విషయాలనెన్నింటిలోనో మనశ్శాంతిని కోల్పోతూ వుంటాము. దానివల్ల మన ఆరోగ్యము దెబ్బతింటుంది. వాతావరణం కలుషితమవుతుంది. పరిస్థితులు దిగజారిపోవచ్చు గూడ. మనకే గాక అవతలి వారికి గూడ యిలాంటి పరిస్థితిని తెచ్చి పెట్టినవాళ్ళమవుతాము. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు ఆలోచిస్తూ పోతే రోజు రోజుకూ మన మనస్సు శాంతిని పొందుతుంది. అప్పుడు పెద్ద విషయాలలో గూడ క్రమంగా యిది అలవాటవుతుంది. అప్పుడు ఎన్నో సమస్యలకు పరిష్కారం దానంతటదే లభిస్తుంది.

అంతేగాక మన ఇష్టాయిష్టాల ప్రకారం జరగాలనుకోవడాన్ని మార్చుకోవడం వల్ల గూడ మనశ్శాంతిని పొందడానికి అవకాశమున్నది. అవతలివారు వారి యిష్ట ప్రకారం పోవడం మనకు యిష్టం లేకపోతే, వారి యిష్టపకారం వారు చేస్తున్నారు అని అవతలివారిపట్ల కోపద్వేషాలు ఏర్పరచుకోకపోవడం వల్ల గూడ మనశ్శాంతిని పొందవచ్చు.

మనం అనుకున్నది జరుగలేదు, లేక మనకు ఎవరో ద్రోహం చేసారు. ఇటువంటి విషయాలలో గూడ బాబా ఎందుకు అలా చెప్పారోననిగాని, మన కర్మను మన మంచికే ఇలా అనుభవింపజేస్తున్నారోనని గాని అనుకోవడం వల్ల గూడ మన మనస్సు ప్రశాంతమవుతుందని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. అప్పుడు చెన్నబసప్ప, వీరభద్రప్పలవలె తిరిగి తిరిగి ఒకరిపై నొకరు ద్వేషాలను పొందకుండా వుండగలమని ఆయన చెప్పేవారు.

ఈ విధంగా ఎప్పుడైతే భావిస్తున్నామో అప్పుడు రాగద్వేషాలు పలుచబడి భగవంతుని పట్ల విశ్వాసము పెరిగి, ఒకానొక ప్రేమతత్త్వము ఏర్పడడం ప్రారంభమవుతుంది. తద్వారా మనము (మంచి) మనసున్న వాళ్ళము, మనసులేని వాళ్ళమూ అవుతాము. తద్వారా భగవంతుని కృపకు పాత్రులమవుతాము.

పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రవచించిన విషయాలు, ఆయన రచించిన అమూల్య గ్రంథాలు పారాయణ, మనము చేస్తుంటే ఆయన ఏమి చెప్పారో ఆలోచిస్తుంటే, ఆచరించడానికి ప్రయత్నిస్తుంటే ఆయన చెప్పిన యిట్టి వివేకవంతమైన ఆలోచన అలవడక తప్పదు. అప్పుడు ఆయన పట్ల కృతజ్ఞతాభావం పెరిగి పెరిగి మహావృక్షంగా మనలో పాతుకుంటుంది. పూజ్యశ్రీ మాస్టరుగారి కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా మనం ఆయన చెప్పిన విధంగా వివేకంతో ఆలోచించి, మంచి మనసుగలవారమై, మన మనసును ఆయనకు సమర్పించడం వల్ల మనసులేనివారమై ఆయన కోరుకునే విధంగా తయారవుతాము. అదే ఆయనకు సమర్పించవలసిన కృతజ్ఞతార్చన. ●

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి విజయలక్ష్మి, హైదరాబాద్**

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లితో తన అనుభవాలను, అనుభూతులను హైదరాబాదుకు చెందిన శ్రీమతి విజయలక్ష్మిగారు ఈ విధంగా తెలియచేస్తున్నారు.

నేను చిన్నతనంలో ఎక్కువగా తెనాలి దగ్గర పల్లెటూరులో మా మేనత్తగారింట్లో పెరిగాను. మా మావయ్యగారు మాస్టరు సి.వి.వి గారిని అనుసరించేవారు. నా పదహారవ ఏట మాస్టరు ఈ.కే. గారిని దర్శించాను. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి గురించి కూడా వింటూండేదానిని. మా ఇంట్లో సత్సంగాలు జరిగేవి. తరువాత నా చదువు, వివాహం, పిల్లలు.... ఈ క్రమంలో మహాత్ములకు, సత్సంగాలకు దూరమయ్యాను. మళ్ళీ అలాంటి సాంగత్యం దొరకదేమోనని చాలా బాధగా వుండేది.

2000 సంవత్సరంలో మేము చిక్కడపల్లిలో వున్నప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు అక్కడకు దగ్గరలోనే వుంటున్నారని తెలిసి దర్శనము చేసుకున్నాను. ఎప్పుడో చిన్నప్పుడు పరిచయమైన మహాత్ములు, సత్సంగాలు చాలా సంవత్సరాల తరవాత పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకున్నాక తిరిగి ప్రారంభమయ్యాయి అనిపించింది. నా పుట్టింటికి వచ్చిన భావన కలిగింది. నాకు పెద్ద అండ దొరికినట్టు అనిపించింది. నా ఆనందానికి అవధులు లేవు. నేను తెలుగులో ఎం.ఏ. చేసినా నాకు ఉద్యోగం రాలేదు. పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పుకుంటే పారాయణ చెప్పారు. అలా చేసుకుంటూ ఉంటే నాకు ఉదయం మరియు సాయంత్రం కాలేజీలలో ఉద్యోగాలు వచ్చాయి. పూజ్యశ్రీ అమ్మగారు నన్ను చాలా ఆదరంగా చూసేవారు.

ఒకసారి విజయదశమికి పూజ్యశ్రీ అమ్మగారు చిక్కడపల్లి ఇంటి బయట వరండాలో దర్శనమిస్తున్నారు. నేను ఆరోజు దర్శనానికి వెళ్ళినప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు సాక్షాత్తూ అమ్మవారిలా దర్శనం ఇచ్చారు. ఒక్కసారిగా ఒళ్ళు పులకరించింది. సాక్షాత్తు జగన్మాత అత్యంత నిరాడంబరంగా మనమధ్య వున్నారని బోధపడింది.

నాకు పూజ్యశ్రీ అమ్మగారికి సేవ చేసుకోవాలనిపించేది. కానీ మా ఇంటి పరిస్థితులు అందుకు అనుకూలంగా వుండేవి కాదు. అయితే పూజ్యశ్రీ అమ్మగారు, అక్కడకు దగ్గరలో వుండే అవధూత అయిన చిక్కడపల్లి అవ్వగారిని చూపించి, నాకు వీలైన సమయంలో ఆమెకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. అది కూడా పూజ్యశ్రీ అమ్మగారి దయేనని నాకు అర్థమైంది.

పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర జరిగే పూజలలో నాకు చాలా ఆనందం కలిగేది. మనం పూజ చేసుకుంటుంటే, సత్సంగ సభ్యులొకరు పూజ చదివేవారు. మనం పువ్వులు వేసుకుని పూజ చేసుకోవాలి. కానీ నాకు పూజ మొదలవగానే మనస్సు భావంలోకి వెళ్ళిపోయి పువ్వులు వేయాలన్న దృష్టి కూడా వుండేది కాదు. అలా ఆనందంగా వుండిపోయి ఏమీ చేయాలనిపించేది కాదు. నాకు ప్రత్యేకించి పెద్ద పెద్ద అనుభవాలు లేకపోయినా ప్రతిక్షణం పూజ్యశ్రీ అమ్మగారు నాతోనే వున్నట్లుంటుంది. అదే నాకు పెద్ద అనుభవం!!

చిక్కడపల్లినుంచి పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరికి, ఆ తరువాత నాగోలుకు వెళ్ళిపోయిన తరువాత కూడా

*మిగతా 29వ పేజీలో*

# పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ 98వ జయంతి వేడుకలు


**శ్రీమతి టి. పద్మావతి**

గుమ్మళంపాడు సమీపంలోని 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానము' నందు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అక్టోబర్ 30వ తేదీ వుదయమే అతి సుందరంగా అలంకరించబడిన పీఠంపై శ్రీ సాయినాథులవారు, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి చెరొక వైపు ఆసీనులై వుండగా, మధ్యలో దేదీప్యమానశోభతో పటం రూపంలో పూజ్యశ్రీ మాస్టరుగారు వేదికను అలంకరించారు. 30వతేదీ వుదయం ముగ్గురు మూర్తులకు మేలుకొలుపుతో వుత్సవ వేడుకలు మొదలైనాయి. కాకడ హారతి, అనంతరం కాఫీ నివేదన, తదుపరి ప్రత్యేకమైన మంగళస్నానాలు, వారి సన్నిధిలో గురుచరిత్ర, శ్రీ సాయి లీలామృతము పారాయణ, తరవాత అల్పాహారం నివేదన జరిగాయి. తదుపరి పూజ్యశ్రీ అమ్మగారి సమాధిని పూజ్యశ్రీ మాస్టరుగారు ఆసీనులై వున్న రూపాన్ని పువ్వులతో అద్భుతంగా అలంకరించారు.



అలంకరణ పూర్తయిన తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రియపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు వారి సతీమణితో కలిసి, అక్కడకి వచ్చిన, రాలేకపోయిన భక్తులందరి తరపున విశేషపూజ చేశారు. పూజానంతరం కొద్దిసేపు సత్సంగం చేసిన తర్వాత మధ్యాహ్న ప్రసాద నివేదన జరిగింది.

ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరంలో భక్తులందరూ వుదయం నుంచి పూజా కార్యక్రమాల్లో పాల్గొని వారి కొరకు ఏర్పాటు చేయబడిన వాహనంలో సాయంత్రం 4 గంటలకి పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి చేరారు. సాయంత్రం పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆశ్రమ ఆవరణ అంతా అక్కడ వున్న భక్తులందరూ శ్రద్ధగా శుభ్రం చేసుకుని, మళ్లీ ప్రత్యేకమైన పూలతో పూజ్యశ్రీ అమ్మగారి సమాధిని అలంకరించుకొని సాయంత్రం కార్యక్రమానికి ఆహ్వానం పలికారు. పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రియపుత్రిక



శ్రీమతి వేదవతిగారు ఈ సందర్భంగా సత్సంగం చేశారు. అందులో కొన్ని విశేషాలు,,,

పూజ్యశ్రీ మాస్టరుగారు జన్మించి ఇవాల్టికి 86 సంవత్సరాలు. పూజ్యశ్రీ మాస్టరుగారి లీలలు కానీ, బోధలు కానీ, ఆచరణ కానీ, శ్రీ సాయినాథులవారు చెప్పిన బోధకి అనుసంధానమై వుంటాయి. వాటన్నింటిని ఇవాల్టి మన జీవితంలో ఎలా అన్వయించుకోవాలో, ప్రతివాళ్ళకి వాళ్ళున్నటువంటి స్థాయిలో చెప్పుకుంటూ రావడమే ఆయన అవతార కార్యం. మహాత్ములకి, బాగా సత్సంగాలు చేస్తూ భక్తి మార్గంలో ప్రయాణిస్తున్నాం అనుకునే వాళ్ళకి, తేడా ఏమిటంటే చెప్పడానికి చేయడానికి వున్న తేడా! ఎందుకంటే ఆత్మానుభూతి కలగలేదు కనుక ఆ తేడా ఎప్పుడూ వుంటుంది. ఎప్పుడూ మామిడికాయ రుచి చూడని వాడు దాని గురించి ఎంతసేపు మాట్లాడినా, అనుభవంలోనికి రాలేదు కనుక, అవగాహన లోపంతోనే మాట్లాడుతాడు. 'భగవద్గీత శ్రీకృష్ణుడు కంటే కూడా బాగా చెప్పగలిగిన వాళ్ళు వుంటే వుండొచ్చు కానీ వాళ్ళు చేయలేనిది శ్రీకృష్ణుడు చేసినది విశ్వరూప సందర్శనం' అని పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రవచనాలలో చెప్పారు. మనందరం చాలా సంవత్సరాలనుంచి పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పారాయణ చేస్తూనే వున్నాము. అప్పటినుంచి ఇప్పటివరకు వారి విశ్వరూపం అంతటా తాండవిస్తూనేవుంది. వారి బోధలని నిజాయితీగా ప్రయత్నం చేస్తున్న వాళ్లకి, ప్రయత్నిస్తున్నాం అని భ్రమించేవారికీ కూడా వారు లీలలు ప్రసాదిస్తూనే వున్నారు. మన నిజాయితీ కూడా ఎప్పటికప్పుడు మారుతూనే వుంటుంది. ఒక్క విషయంలో కూడా ఎప్పుడూ స్థిరంగా వుండదు. మహాత్ముల గ్రంథాలు చరిత్రలు చదువుతున్నప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, మనకోసం వచ్చి ఇన్ని విషయాలు చెప్తున్నప్పుడు అసలు ఇలా వుండకూడదని తీవ్ర వైరాగ్యం వస్తుంది. కానీ అది నిలవదు. రెండు మూడు రోజులు ఆ భావన వున్నత స్థాయిలో వుండి తర్వాత చిన్న చిన్నగా పలుచబడి, ఆయన భక్తి నేపథ్యంగా మాత్రమే వుండి, ఇతర విషయాలు మన మీద ప్రభావాన్ని చూపిస్తూవుంటాయి. కాబట్టి మనలో ఆధ్యాత్మిక బీజం నాటుకోవాలి అంటే, మన మనసు ఏవిధంగా చక్కగా వుంచుకుంటే ఆ బీజం సరైన వృక్షంగా తయారవుతుందో, దానికి కావలసిన ఆధారం(base) మాస్టరుగారు కానీ, బాబాగారు కానీ ఎక్కువగా ఇస్తూ వచ్చారు. మాస్టరుగారు ధర్మాచరణ సహజం అవడానికి కావలసినటువంటి బేస్ గురించి చెప్పారు. ధర్మం బలవంతం మీద సాధించేది కాదు. వివేకం వల్ల సాధించాలి. వివేకంఎలా వస్తుంది అంటే, మహాత్ముల బోధలు, ఆచరణ ద్వారా వస్తుంది. అందువల్ల ఆ సాంగత్యాన్ని విపరీతంగా పెంచుకోవడం గురించి పూజ్యశ్రీ మాస్టరుగారు ఎక్కువ ప్రధాన్యతనిచ్చారు. పూజ్యశ్రీ మాస్టరు గారు ఒక చోట 'మహాత్ముల చరిత్రను చదవటం, వారి సన్నిధికి వెళ్ళటం, అక్కడ సేవ చేసుకోవడం, ఇవన్నీ చాలా ఆనందదాయకమైన సాధనా పద్ధతులు' అని రాస్తారు! మనల్ని ముక్కు మూసుకుని తపస్సు చేయమనలేదు, వుపవాసాలు వంటి కఠిన నియమాలు పెట్టలేదు, ఎందుకంటే ఆ నియమాల ద్వారా రావాల్సింది ఏదైతే వుందో అది చాలా సులభంగా మహాత్ముల సన్నిధి, పారాయణల వల్ల పొందవచ్చునని పూజ్యశ్రీ మాస్టరు గారు, శ్రీ సాయినాథులవారు చెప్పారు.

మనం చాలా సత్సంగాల్లో చెప్పుకున్నాం, ఉపవాసాలు, ఉపదేశాలు బాబా వద్దన్నారు అని! ఉపవాసం అంటే నిరంతరం స్మరణలో వుండే సామర్థ్యం. అది లేకుండా అన్నం తినకుండా వుంటే అది కడుపు మాడ్చుకోవటమే అవుతుంది. అలాగే వుపదేశాన్ని నిషేధించారు. ఎందుకంటే ఉపదేశాలు రెండు రకాలుగా హానికరమని చెప్పారు ఎటువంటి వాడు ఉపదేశం ఇవ్వాలి, ఎటువంటివాడు ఉపదేశం తీసుకోవాలి అనేది శాస్త్రాల్లో చెప్పి వున్నప్పటికీ, వాటిని పక్కకు పెట్టి అర్హత లేనివాడు ఉపదేశం ఇవ్వటము, అర్హత లేనివాడు తీసుకోవడం ఈ రెండిటి వల్ల దాని ప్రయోజనం నెరవేరకపోగా హాని జరుగుతుంది. ఉదాహరణకి మనం ఎప్పుడూ చెప్పుకుంటున్న రావణాసురుడి సంగతి. అతనికి సకల శాస్త్రాలు



తెలిసినా, వాటిని దుర్వినియోగం చేసుకోవడానికి వుపయోగించుకున్నాడు. అర్హత కలవాళ్ళకే ఆధ్యాత్మిక రహస్యాలు చెప్పేవాళ్ళు సద్గురువులు. శిష్యులు చాలా సంవత్సరాలు సేవ చేసుకుని వాళ్ళలో వున్న దుర్గుణాలన్నీ వదిలిపోయిన తర్వాత వీడికి ఇప్పుడు ఇస్తే తప్పకుండా సద్వినియోగం చేసుకుంటారు అని నమ్మకం ఏర్పడినప్పుడు వారు ఉపదేశం ఇచ్చేవారు. కనుక బేస్ అనేది చాలా ముఖ్యం. నీలో వున్న దుర్గుణాలని తొలగించుకుంటూ నిజాయితీగా ప్రయత్నం చేస్తున్నప్పుడు నీ లౌకికమైన కోరికలను, కష్టాలను, శ్రేయస్కరమైనవాటిని నేను చూసుకుంటాను అన్నారు బాబా. మనం నిజాయితీగా ప్రయత్నం చేస్తున్నప్పుడు, మిగతా జీవిత పరిస్థితులన్నీ దానికి దోహదం చేసేటట్టుగా మనకు వుత్సాహం కలిగించేలా మల్చుకోవడంలో పూజ్యశ్రీ మాస్టరుగారి బోధలు ఆచరణ, పూజ్యశ్రీ అమ్మగారి బోధలు, ఆచరణ చాలా కీలకమైనవి. అవి లేకపోతే అర్థమే కాదు మనకు. అందుకని మాస్టరుగారి అవతరణ చాలా విశిష్టమైనది. ధర్మ స్వరూపమే ఆయన. ఒకసారి ఒక శిష్యుడు "మాస్టరుగారూ, మీరు ధర్మం తప్పారు" అని అంటే, "ఒరేయ్ నేను ధర్మం తప్పడమంటూ జరిగితే తూర్పున వుదయించాల్సిన సూర్యుడు పడమట వుదయిస్తాడు జాగ్రత్త" అన్నారు. అంత ధీమాగా ఎలా చెప్తారు? అంటే అది తామై వున్నారు కనుక! అందువల్ల మనకి ఎక్కడైనా ఎలా ప్రవర్తించాలి అని సందేహం వస్తే మహాత్ముల ఆచరణే ప్రధానంగా తీసుకోమని శాస్త్రాలన్నీ కూడా చెప్పాయి. దానికి వుదాహరణగా ఏం చెప్పారంటే వైద్య గ్రంథాలన్నీ కూడా నిజమైనా, అవి వైద్యుడితో సమానం కాదు కదా అని చెప్పారు, ఎప్పటికప్పుడు ఇదే ఆఖరు రోజు అయితే బాబాకి నచ్చినట్లు ఎలా జీవిస్తామో అలా ప్రతిరోజూ జీవించాలి అని చెప్పారు. ఇటువంటి అమూల్యమైనటువంటి ఆచరణ యోగ్యమైనటువంటి బోధలు పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితంలో వున్నాయి. పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాల వల్ల ఎప్పుడు ఏ పని ఎలా చేయాలో మనం నేర్చుకోవచ్చు. కాబట్టి మన వ్యక్తిగత జీవితాన్ని సామాజిక జీవితాన్ని నిర్మించుకోవడానికి మనందరం కూర్చుని వాటిని గురించి ఆలోచించుకోవడం చర్చించుకోవడం చాలా ముఖ్యమైన విషయం. కలిసి ముందుకు కదిలితే, సులభంగా వుంటుంది. ఒక్కరు నడిస్తే చాలా కష్టతరం. అదే సత్సంగం యొక్క ముఖ్యప్రయోజనం. కాబట్టి వ్యక్తిగతమైన సాధన, సామాజిక సాధన చేస్తూ, మనం చేసుకునేటటువంటి వుత్సవాలు పండుగలు ఇవన్నీ కూడా వ్యక్తిగతమైన సాధనల్ని వున్నతమార్గం వైపు తీసుకెళ్లాలి. ఇట్లా ఒకదానికొకటి అనుసంధానమై వెళ్లాలని పూజ్యశ్రీ మాస్టరుగారు 'సత్సంగం-భజన' గ్రంథంలో, 'శిరిడి హారతులు' గ్రంథంలో, 'సాయినాథ పూజ' గ్రంథంలో రాశారు. వీటన్నిటినీ అవగాహన చేసుకుని ఆచరించిన వారికి ఈ జన్మలోనే వాళ్ళంతటి వాళ్లుగా తయారు చేసే అక్షర స్వరూపాలు వారి గ్రంథాలు. అది అర్థం కాకపోతే వారి ఆచరణ వుంది. ఇవాల్టి రోజున ఇక్కడ మనందరం వున్నామంటే వారి కరుణ, వారి యొక్క గొప్పతనం ఎక్కువ, మన సామర్థ్యం చాలా తక్కువ. దీన్ని మనం గుర్తించి ఎప్పుడూ కృతజ్ఞులమై వుండాలి. ఇప్పటినుంచి అయినాసరే సాధ్యమైనంత వరకు వారి మార్గంలో నడుస్తామని నిర్ణయం తీసుకొని అందుకు ప్రయత్నిద్దామని, మనందరినీ జన్మజన్మలుగా నడిపిస్తూ మనకు అండగా వుంటూ తగిన శిక్షను శిక్షణను ఇచ్చి, మనల్ని చేయిపట్టి నడిపించమని పూజ్యశ్రీ మాస్టరుగారికి అమ్మగారికి మనసారా ప్రార్థన చేద్దామని,,,,వారి సత్సంగాన్ని ముగించారు.

తరవాత భక్తులందరూ పూజ్యశ్రీ మాస్టరుగారికి మనసారా నమస్కరించుకుని ప్రసాదాన్ని స్వీకరించి ఆనాటి వుత్సవానికి స్వస్తి పలికారు. ●

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## 14వ ప్రసంగము

పరమాత్మ స్వరూపము సగుణము, నిర్గుణము అని రెండు రకాలు.

*శ్లో॥ సకామ సగుణోపాస్తిర్నృణాం*
*భోగాయ సంభవేత్।*
*నిష్కామా చిత్తశుద్ధ్యర్థేత్యేవం*
*శాస్త్రార్థ నిర్ణయః॥*

భావం: కామంతో సగుణోపాసన చేసినట్లయితే మానవులకు భోగ్య పదార్థాలు లభిస్తాయి. నిష్కామి అవుతూ సగుణోపాసన చేసినట్లయితే చిత్తము శుద్ధి అవుతుంది. ఇలా శాస్త్రార్థముతో తేలినది.

### రకరకాల ఉపాసనా పద్ధతులు

ఉపాసన ప్రతీకోపాసన, అహంగ్రహోపాసన అని రెండు రకాలు. అన్యములో అన్యబుద్ధిని చేసే ఉపాసన ప్రతీకోపాసన. సాలిగ్రామ, శివలింగము మొ॥న వాటియందు విష్ణువు, శివుడు మొ॥న వారనే భావంతో చేసే ఉపాసన ప్రతీకోపాసన. ఉపాస్య, ఉపాసకులపట్ల అభిన్నభావంతో చేసే ఉపాసన అహంగ్రహోపాసన.

### సగుణోపాసన

అహంగ్రహోపాసనకు మూర్తి వేరొకటి అక్కరలేదు. విష్ణువు, శివుడు మొ॥న వారిని ప్రస్తుత ఆచారాన్ననుసరించి చక్రహస్తుడు, త్రిశూలధారి అనే భావంతో చేసే ఉపాసన పురాణాలలో చెప్పబడినది. తంత్రసమ్మతమైనది. వేదాలలో చెప్పబడిన విష్ణుసూక్తము ద్వారా పరమాత్మ రూపాన్ని – విష్ణు శివాత్మకమైన పరమాత్మ రూపాన్ని ఉపాసించడం వైదికవిష్ణు అహంగ్రహోపాసన అని, వైదికశివ అహంగ్రహోపాసన అనీ చెప్పబడుతుంది.

వీటికంటే వేరైన విరాట్టుయొక్క – అంటే హిరణ్యగర్భుని యొక్క అహంగ్రహోపాసన వేదాలలో చెప్పబడింది. ఇందులో వేదాలలో చెప్పబడిన విధిని అనుసరించి పురాణాలు మొ॥న వాటిని అనుసరించి అహంగ్రహోపాసన చేయాలి.

సహస్రశీర్షా పురుషః మొ॥న వేదమంత్రాల ద్వారా విరాట్ పురుషుని ఉపాసన జరుగుతుంది. హిరణ్య గర్భస్సమవర్త తాగ్రే మొ॥న మంత్రాల ద్వారా హిరణ్యగర్భోపాసన జరుగుతుంది. నిర్గుణ బ్రహ్మోపాసన చేయడానికి సమర్థులు కానివారి కోసం సగుణ బ్రహ్మోపాసనావిధికి శాస్త్రాలలో ప్రతిపాదించబడింది.

*శ్లో॥ నిర్విశేషం పరంబ్రహ్మ*
*సాక్షాత్కర్తుం అనీశ్వరాః॥*
*యేమందాస్తేఽనుకంప్యంతే*
*సవిశేషనిరూపణైః॥*

భావం : నిర్విశేష పరబ్రహ్మ సాక్షాత్కారము పొందడానికి సామర్థ్యంలేని మందాధికారులపై గల అనుగ్రహం వలన సగుణ బ్రహ్మోపాసన విధించబడింది.

## నిర్గుణోపాసన

సగుణోపాసన పరిపక్వమైన తర్వాత నిర్గుణోపాసన చేయబడుతుంది. రామగీతలో ఇలా వుంది–

*శ్లో॥ అఖండసచ్చిదానంద*
*నిర్గుణోపాసనం మహత్।*
*సద్యః కైవల్యహేతుః*
*స్యాదహం బ్రహ్మేతి చింతనమ్॥*

భావం:'నేను బ్రహ్మన్ని' అనే ఆలోచనతో కూడిన అఖండ సచ్చిదానంద నిర్గుణబ్రహ్మముయొక్క అహంగ్రహోపాసన సాధనాలన్నింటికంటే శ్రేష్టమైన సాధనము. అది వెంటనే అపరోక్షజ్ఞానము ద్వారా మోక్షాన్ని లభింప చేస్తుంది.

అయినా నిర్గుణోపాసన చంచలమైన చిత్తము కలవాడికి కష్టసాధ్యమైనది. సామాన్యులకు సగుణోపాసనే ఆచరణయోగ్యమైనది.సగుణోపాసనకూడా చేయలేనివాడు నిష్కామ కర్మయోగాన్ని ఆచరించాలి. నిష్కామ కర్మకు కూడా అసమర్థుడైతే సకామకర్మనే చేయాలి. సకామకర్మను కూడా ఆచరించలేని వాడు నికృష్టుడు. అతనికి అధోగతి కలుగుతుంది. ఇటువంటి వారినే పామరులు అంటారు.

పంచదశి ఇలా చెబుతుంది –

*శ్లో॥ పామరాణాం వ్యవహృతేర్వరం కర్మాద్యనుష్ఠితిః॥*
*తతోఽపి సగుణోపాస్తిః నిర్గుణోపాసనా తతః॥*

భావం : పామరులలాగా వ్యవహరించటం కంటే వైదిక కర్మానుష్ఠానం శ్రేష్ఠమైనది. వైదిక కర్మానుష్ఠానం కంటే సగుణ బ్రహ్మోపాసన శ్రేష్ఠతరమైనది. సగుణ బ్రహ్మోపాసనము కంటే నిర్గుణోపాసన అత్యంత శ్రేష్ఠమైనది.

జ్ఞానానికి సాక్షాత్తూ సాధనమైనది అన్ని సాధనములకంటే ఉత్తమమైనదని తాత్పర్యము.

రాఘవ : నిర్గుణ బ్రహ్మన్ని ఎలా ఉపాసించాలి?

స్వా॥ప్ర॥ : ఈ ప్రశ్నను మహాత్ముల నెవరినైనా అడగవలసిందే! నేను మహాత్ముడిని కాదు. జ్ఞానిని కూడా కాను.

## అనధికారికి ఉపదేశించడం నిషిద్ధము

ఈ సందర్భంలో శ్రీ నిత్యానంద స్వామివారు రాఘవజీ వైద్యతో ఇలా అన్నారు: "మీరు మొదట అధికారాన్ని పొంది రండి. ఆ తర్వాత స్వామివారు తెలుపుతారు. ఆ విషయపంచకము నుండి (అయిదు రకాల విషయ వాంఛల నుండి) ముక్తిని పొందేవరకు బ్రహ్మవిద్యను తెలుసుకొనే అధికారము లభించదు. వైరాగ్యము లేనివాడికి బ్రహ్మవిద్యను ఉపదేశించడం ధర్మం కాదు. అధికారం (అర్హత) లేనివారికి ఉపదేశించకూడదని శృతి (వేదము) ఘోషిస్తున్నది."

*శ్లో॥ విద్యా హ వై బ్రాహ్మణమాజగామ*
*గోపాయ మా శేవధిష్టేఽహమస్మి।*
*అసూయకాయానృజవేఽయతాయ*
*న మా బ్రూయా వీర్యవతీ తథా స్యామ్॥*

భావం : బ్రహ్మవిద్య బ్రహ్మజ్ఞుని దగ్గరికి వెళ్లి ఇలా చెప్పింది– "నీవు నన్ను రక్షించు. నేను నీ ధనాగారాన్ని. అసూయ కలవాడికి, కపటునికి, ఇంద్రియ నిగ్రహము లేనివాడికి నీవు నన్ను ఉపదేశించవద్దు. ఈ విధంగా అసూయాపరుడు మొ॥న వారికి నన్ను ఉపదేశించకుండా వుండటం వల్ల నేను బలాన్ని పొందుతాను."

**- సశేషం**

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - 3

### 1. కాయానుపశ్యనము లేక శరీరధ్యానము

***4. శరీర అంతర్భాగాల ధ్యానము:*** చర్మము చేత కప్పబడిన ఆకాశములైన అంతర్భాగాలను గూర్చిన స్మృతి – శరీరం వ్యష్టిత్వంతో గూడిన ఒకే ఒక్క వస్తువు అన్న భ్రాంతిని తొలగిస్తుంది. అంతేకాక శరీరం సుందరమైనది అనే భ్రాంతిని కూడా తొలగించి దాని అశుభ్రతను గుర్తు చేస్తుంది. శరీరాన్ని చర్మము, మాంసములతో కప్పబడిన అస్థిపంజరంగా గుర్తించినపుడు లేక చిత్రవిచిత్రమైన ఆకృతులుగల వివిధ వస్తువుల సంపుటి అని గుర్తించినపుడు అదే తానన్న భ్రమ తొలగడమే గాక అన్య దేహాలపై వ్యామోహం కూడా తొలగుతుంది.

అంతర్భాగాలను గూర్చి ధ్యానించడంలో మనస్సు భావపూరితమైన ఆకర్షణ వికర్షణాలకు లోబడక ఏకాగ్రత చెందినటులైతే క్రమంగా దేహమే తానన్న భ్రాంతి తొలగడమేగాక, అప్రయత్నంగా విషయేచ్ఛల వలయం తొలగిపోతుంది. సాధన జ్ఞానస్థితియొక్క 2వ, 3వ దశల వరకు కొనసాగేలోపల యీ పరిమాణాలు అసంపూర్ణంగాను, తాత్కాలికంగాను వుండిపోతుంది. కాని శ్రద్ధగా సాధన చేస్తే ఆ స్థితులను త్వరగా సమీపించగలరు. సులువెరిగి తేలికగా, త్వరితంగా మనస్సు నాస్థితికి చెందించగలగడం శరీరంపై వ్యామోహాన్ని పెరగకుండా విషయేచ్ఛలను అరికట్టటానికి ఉపకరిస్తుంది.

ఈ సాధనలో శరీరము పైగల వ్యామోహాన్ని అరికట్టటానికి దానిపట్ల జుగుప్సను కల్గించుకొనే యత్నంలేదు. కేవలం వ్యామోహం నుండి అయత్నంగా విడివడడానికి, దానియొక్క యదార్థ తత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నిస్తుంది.

ఆధునిక నగరజీవనంలో మానవుడు కోరికలను రెచ్చగొట్టే అనేక శక్తులను యెదుర్కోవలసి వస్తుంది. సినిమా, నాటకము, రేడియో, టెలివిజన్, సాహిత్యము, కళ, ఎడ్వర్టయిజ్మెంట్, పత్రికల ముఖ చిత్రాలు అన్నీ యిట్టి శక్తులే. ఇవి నిత్యము తిరిగి తిరిగి తారసిల్లుతూండడంవల్ల, మనస్సు యొక్క వివిధ స్థాయిలలో వీటి ప్రభావం మేల్కొని యెవరూ గుర్తించలేనంత లోతుగా నైతికంగా, మానసికంగా, మనస్తత్వాన్నంతటిని వికారంగా మలుస్తాయి. వీటి ప్రభావాన్నుండి ప్రతివ్యక్తి దృఢనిశ్చయంతో తనను తాను రక్షించుకోవాలి. ఇందుకు శరీరాంతర్భాగ భావన యెంతో ఉపకరిస్తుంది.

***5. నాలుగు భూతాలు:*** శరీరం నాలుగు భూతాలతో చేయబడి వున్నది అన్న విషయాన్ని ధ్యానిస్తే, సృష్టిలోని జడమైన వస్తువులన్నీ వేటితో చేయబడి వున్నాయో అట్టి వాటితోనే తన శరీరం కూడ చేయబడియున్నదన్న గుర్తింపు కలుగుతుంది. ఇందువలన శరీరం వ్యక్తిత్వ రహితమైనదన్న గుర్తింపు దృఢతరమవటమే కాక, శరీరమే తానన్న భ్రాంతి తొలగి వ్యామోహం తొలగుతుంది.

- సశేషం

# భగవాన్ శ్రీ భరద్వాజ

**శ్రీమతి శ్రీదేవి**

## అధ్యాయం - 2

## ఆదిదేవుని ఆవిర్భావం

**(గత సంచిక తరువాయి)**

ఋషివర్యులైన శ్రీ అనంతాచార్య పవిత్ర సన్నిధిలో లక్ష్మడు కూడా ఎంతో సద్గుణ సంపన్నుడిగా మారిపోయాడు. అతడికి వారి కుటుంబంతో మమతాను బంధాలు గాఢంగా పెనవేసుకుపోయాయి. అందువలన కాలాంతరంలో అతడు తన స్వగ్రామం వెళ్ళిన తర్వాత కూడా శ్రీ అనంతాచార్యగారింటికి తరచు వస్తూ పోతూ వుండేవాడు.

ఒక చిత్రమైన విషయం ఏమిటంటే - శ్రీ అనంతాచార్యగారు గానీ, వారి కుమారులు గానీ అస్వస్థులుగా వున్న సమయంలో తన స్వగ్రామంలో వున్న లక్ష్మడికి శ్రీమతి బుచ్చి వెంకట లక్ష్మిగారు స్వప్న దర్శనమిచ్చి లక్ష్మడుతో తమ యింట్లో ఫలాని వారు అస్వస్థులుగా వున్నారని, వెంటనే విజయవాడ వెళ్ళి వాళ్ళకు సహాయపడవలసిందనీ చెప్పటంతో మర్నాటి వుదయమే లక్ష్మడు వీరింటికి వచ్చేసేవాడు. తమ అనారోగ్యం గురించి ఉత్తరం గానీ, కబురు చేయటం గానీ ఏమీ లేకుండానే వెంటనే వచ్చిన లక్ష్మడిని చూచి ఆశ్చర్యపోయే వారి కుటుంబ సభ్యులతో "అమ్మగారు కలలో కన్పించి మీరు అనారోగ్యంగా వున్నారని చెప్పారు. అందుకే వచ్చాను" అనేవాడు. ఈ విధంగా లక్ష్మడు మహిమాన్వితమైన శ్రీ అనంతాచార్య గారి కుటుంబంతో మమేకమై వారి కుటుంబ సభ్యులలో ఒకడుగా వారితో కలిసిపోయాడు.

లక్ష్మడు పిల్లలతో చాలా రకాల ఆటలు ఆడేవాడు. వాటిలో "రామ లక్ష్మణులు- ఆంజనేయస్వామి" ఆట ఒకటి. లక్ష్మడు ఎంతో బలిష్టంగా వుండేవాడు. భరద్వాజ, బోధాయన రామలక్ష్మణులు, లక్ష్మడు ఆంజనేయుడు. వీళ్ళిద్దరూ లక్ష్మడి భుజాలపై కూర్చుంటే ఆంజనేయస్వామి పాత్రధారి లక్ష్మడు వాళ్ళని భుజాలపై మోస్తూ సుగ్రీవుని కొండపైకి అంటే మేడపైకి తీసుకెళ్ళాలి, తిప్పాలి. అదీ ఆట. లక్ష్మడు పిల్లలేది చెప్పినా చేసేవాడు. వాళ్ళు ఆడమన్న ఆటలన్నీ ఆడేవాడు. భరద్వాజకి క్రికెట్, చెస్ ఆటలంటే చాలా యిష్టం. ఆ ఆటలు చాలా బాగా ఆడేవారు.

మరొక విశేషమేమంటే భరద్వాజ పాటలు చాలా బాగా పాడేవాడు. కంఠస్వరం ఎంతో మధురంగా వుండేది. కానీ కాలాంతరంలో ఆయన లోకోద్ధరణ అనే లక్ష్యంతో జీవితమంతా ప్రజల ఆత్మోన్నతికై శ్రమిస్తూ గడిపారు. అందువల్ల సాయినాథుని భక్తిపూరిత భజనలు తప్ప యితర గీతాలేవీ ఆయన ఆలపించటం ఎప్పుడూ ఎవరూ విని వుండలేదు.

భరద్వాజకి చిన్నప్పటినుండీ కూడా ధైర్యం, మనోనిబ్బరం ఎక్కువ. ఒకసారి అతడికి కుడిచెవి పోటు వస్తుండటంతో వాళ్ళ నాన్నగారు డాక్టరుకు చూపించుకొని రమ్మని భరద్వాజని పంపారు. అప్పుడు భరద్వాజ వయస్సు పది సంవత్సరాలు. శ్రీ అనంతాచార్య తాము తమ పిల్లల వెంట వాళ్ళకి తోడుగా ఎక్కడికీ వెళ్ళేవారు కాదు. వాళ్ళు యితరులపై ఆధారపడకుండా వాళ్ళపని వాళ్ళే చేసుకొనాలనే వుద్దేశంతో

పిల్లలను ఒంటరిగానే పంపేవారు. డాక్టర్ అతని చెవిని పరీక్షించి చెవిలో దుర్మాంసం పెరిగిందనీ వెంటనే ఆపరేషన్ చెయ్యాలని, పెద్దవాళ్ళని పిలుచుకు రమ్మనీ చెప్పారు. అయితే భరద్వాజ, "ఎవ్వరినీ పిలుచుకొని రానక్కర్లేదండీ! నాకేమీ భయం లేదు. మీరు ఆపరేషన్ చేసేయండి" అన్నాడు. డాక్టర్ మొదట ఆశ్చర్యపోయి, తర్వాత ఆ పిల్లవాని ధైర్యానికి మెచ్చి ఆపరేషన్ చేయ నిశ్చయించి నొప్పి తెలియకుండా వుండేందుకు మత్తు యింజెక్షన్ యిచ్చారు. కానీ ఎంత మత్తు యిచ్చినా ఏ మాత్రం మత్తు ఎక్కక పోవటంతో డాక్టర్ ఆపరేషన్ చేసేందుకు సంశయిస్తుంటే భరద్వాజ, "మత్తు లేకపోయినా ఫర్వాలేదు డాక్టర్ గారూ, ఎంత నొప్పి పుట్టినా నేనేమీ ఏడవను. నేను నొప్పి వల్ల కదులు తానేమోనని ఎవ్వరూ నా కాళ్ళు, చేతులు కూడా పట్టుకోనవసరం లేదు. నేను అసలు కదలనే కదలను. ఆపరేషన్ చేసేయండి" అంటుంటే డాక్టర్ నవ్వుతూ, "అలాగే బాబూ! నువ్వు చిన్న పిల్లవాడివయినా భయపడకుండా ధైర్యంగా వున్నావు. నేను కూడా నీకు ధైర్యంగా ఆపరేషన్ చేస్తాను" అంటూ ఆపరేషన్ చేసి, కట్టుకట్టి యింటికి పంపారు. ఉదయం హాస్పిటల్ కు వెళ్ళి ఎంతకీ యింటికి రాకపోవటంతో కంగారు పడుతున్న యింట్లోని వాళ్ళకి అంత చిన్న పిల్లవాడు ఒక్కడే వెళ్ళి చెవికి ఆపరేషన్ కూడా చేయించుకొని వచ్చేసరికి ఆశ్చర్యంతో నోట మాటరాలేదు. "ప్రక్కన ఎవ్వరూ తోడు లేకుండా ఒక్కడివే ఎలా ఆపరేషన్ చేయించుకున్నావు? నీకు భయం వేయలేదా?" అని అడిగితే "భయమెందుకు? పెద్ద వాళ్ళను పిలుచుకురమ్మని డాక్టరుగారు చెప్పారు. 'ఏమీ అక్కరలేదు. నాకేం భయం లేదు, ఆపరేషన్ చెయ్యండి' అని డాక్టరుగారితో చెప్పాను. ఆయన ఆపరేషన్ చేసేశారు" అన్నాడు భరద్వాజ. ఆ ధైర్యానికి తండ్రి చాలా సంతోషించారు. "భేష్! అలా వుండాలి. బాగా చేశావు" అంటూ తనయుణ్ణి మెచ్చుకున్నారాయన!

# అధ్యాయం - 3

## *విద్యాభ్యాసం*

ఇంట్లోనే తండ్రిగారి వద్ద శిక్షణ పొంది తమ 12 యేట వారణాసిలో మెట్రిక్యులేషన్ పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులైనారు శ్రీ భరద్వాజ. ఆ సమయంలో వారి పెద్దన్న కృష్ణమాచార్యగారు గుంటూరులో లెక్చరర్ గా పని చేస్తుండేవారు. అప్పటికి ఆయనకు వివాహమై ఒక పుత్రుడు జన్మించాడు. భరద్వాజగారు అన్నగారింట్లో వుంటూ గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్, డిగ్రీ చదివారు.

అప్పుడే వికసించిన పుష్పాలవంటి నవ యువత! కళ్ళు తెరచి లోకాన్ని పరికించి చూస్తే చుట్టూ అందమైన లోకం, ఎన్నో ఆకర్షణలు!

మారిపోయిన లోకం పోకడలో దైవం, ఆధ్యాత్మికత మసకబారిపోయాయి. ధర్మం అడుగంటిపోయింది. కళ్ళముందు కన్పించే రంగు రంగుల ప్రపంచం వెనుక అన్ని రంగాలలో వెన్నుపోటు పొడిచి జీవితాలను అధఃపతనానికి దిగజార్చే చురకత్తులు పొంచి వున్నాయని ఆ పసి మనసులకేం తెలుసు?

ఆధునిక యుగంలో కాలేజీ విద్యార్థులకు చదువుకంటే, ముఖ్యమైనవి స్నేహితులు, సినిమాలు, షికార్లు, సరదాలు, వ్యసనాలు! వారిని ఆకర్షిస్తూ యీ ఫ్యాషన్ ప్రపంచంలో జీవిత విలువలను దిగజార్చే ఎన్నో జారుడు మెట్లు! పరమాత్ముని ఆశ్రయించుకొన్న వారికి తప్ప ఈ విషవలయంలో చిక్కుకొనకుండా తప్పించుకొనటం అన్యులకు సాధ్యమా?

అయితే కారణజన్ముడు భరద్వాజగారిని యీ లోకపు కాలుష్యాలు ఏమి చేయగలవు? వాటినుండి తప్పుకొనటం ఆయనకు కరతలామలకమే. అందుకే అందరి యువకులలాగా ఏ ఆకర్షణలకూ లోనుకాలేదాయన. మంచి దుస్తులు వేసుకోవాలని, అందంగా కన్పించాలనే ధ్యాసే లేదు. స్నేహితులతో షికార్లు, సరదా కాలక్షేపాల తలంపేరాదు. సద్వర్తన, కర్తవ్యపాలన - ఇవే ఆయన అలంకారాలు. మలినాలంటని హృదయ నైర్మల్యం, ధర్మ చింతనతో గూడిన పవిత్ర జీవితం - ఇవే ఆయన ఆభరణాలు. ఆత్మ సౌందర్యంతో వెలిగిపోయే ఆ యువకునికి వేరే అలంకారాలతో పనేముంది?

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

ఢాకా లోని రమణాశ్రమం, సిద్ధేశ్వరి లోని ఆశ్రమ వాసులందరూ అమ్మకు అత్యంత సన్నిహిత భక్తులు కావడం వలన అమ్మ రాయపూర్ వెళ్లిన తర్వాత యెన్నాళ్లకూ తిరిగి రాకపోవటంతో అమ్మలేని లోటు వారిని యెంతగానో బాధించేది. అందువలన వాళ్లు అమ్మ దగ్గర వుండే జ్యోతిష్ దాదా కు వుత్తరాలు వ్రాసి అమ్మ విషయాలు తెలుసుకుంటూ వుండేవారు. జ్యోతిష్ దాదా వెంటనే తను కూడా వాళ్లకు జవాబులు రాసి పంపుతూ వుండేవాడు. అమ్మ యెలా వున్నారో, యేమి చేస్తున్నారో తెలియపరుస్తూ వారి మనసుకు కొంత వూరట కలిగిస్తుండేవాడు. ఒకసారి గురుప్రియ అమ్మకు తన ఆవేదనను వ్యక్తపరుస్తూ యిలా వుత్తరం రాసింది. “అమ్మా! మమ్మల్ని మీరు మరచిపోయారా? అందుకేనా మీరు మమ్మల్ని అసలు పట్టించుకోవడం మానివేశారు? మీకు మేము యెందుకు గుర్తు రావటంలేదు. మీ బిడ్డలమైన మమ్మల్ని ఒక్కసారి అయినా మీకు చూడాలని అనిపించటం లేదా? మీరు నిజంగా మమ్మల్ని మరిచిపోకపోతే నెలల తరబడి తల్లిని విడిచి జీవిస్తున్న మీ బిడ్డల బాధ మీకు తెలియకుండా వుంటుందా? మాకు మీ దర్శన భాగ్యం యెప్పుడు కలుగుతుంది?” అంటూ యెంతో దుఃఖంతో గురుప్రియ వ్రాసిన వుత్తరాన్ని అందుకున్న శ్రీ ఆనందమయి అమ్మ యిలా జవాబు వ్రాయించారు: “బాబుగారు (గురుప్రియ తండ్రి శశాంకబాబు) వుత్తరాలు వ్రాస్తూనే వున్నారు కదా? ‘అమ్మా! మిమ్మల్ని చూడాలని వున్నది’ అని యెప్పుడూ వ్రాయనే లేదు. బహుశా బాబుగారు అమ్మ పిలిచినప్పుడే వెళ్లాలని అనుకుని వుంటారు. నేనేమి చేయను? ఇలా అన్నానని బాబుగారితో చెప్పు.” ఆ వుత్తరం చదివిన శశాంకబాబు గురుప్రియ తో “అమ్మ మనలను యిక్కడ వుండమని చెప్పి వెళ్లారు. అమ్మకు యెప్పుడు దయ వస్తుందో యెప్పుడు రమ్మంటారోనని యెంతగానో యెదురు చూస్తున్నాను. మీ దర్శనభాగ్యం ప్రసాదించమని అడగవచ్చో అడుగకూడదో అన్న శంకతో మౌనంగా వున్నాను” అన్నారు. వెంటనే సంతోషంతో “అమ్మా మాకు మిమ్మల్ని చూడాలని వుంది. డెహ్రాడూన్ వచ్చేందుకు దయతో అనుమతించండి” అంటూ అమ్మకు వుత్తరం రాశాడు శశాంక బాబు. ఆ తర్వాత అమ్మ అనుమతితో గురుప్రియా దేవి, శశాంకబాబు డెహ్రాడూన్ వెళ్ళటం జరిగింది. కాశీ నుండి మనోరమ, ఢాకా నుండి బేబీ అక్క మరికొందరు భక్తులు కూడా డెహ్రాడూన్ వచ్చారు.

డెహ్రాడూన్ లో అమ్మ దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ఎందరో విదేశీయులు కూడా అమ్మ దర్శనార్థం రాసాగారు. నిత్యమూ సంకీర్తనలు, పూజలే కాక ఆధ్యాత్మిక చర్చలు కూడా జరుగుతుండేవి. సాధకులు, సాధు సత్పురుషులు తమ ఆధ్యాత్మిక సందేహాలను అమ్మతో విన్నవించుకొని సమాధానాలు పొందుతుండేవారు. నిత్యమూ యెందరో భక్తులు యెన్నో పదార్థాలను, వంటకాలను తెచ్చి అమ్మకు నివేదించి, అమ్మ చేత తమ వంటకాలను కొంచెమైనా తినిపించి ఆ తర్వాతే మిగిలిన పదార్థాలను తమ యిండ్లకు తీసుకొని వెళ్లి వాళ్లు భోజనం చేసేవాళ్లు.

- సశేషం

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి విజయలక్ష్మి, గొలగమూడి

చాలా సంవత్సరాల క్రితం మొట్టమొదటిసారిగా నాకు శిరిడీలో బాబా గొప్ప అనుభవాన్ని ప్రసాదించారు. జయచంద్రారెడ్డిగారి ఆధ్వర్యంలో దత్తక్షేత్రాల యాత్రకు బస్సులు వేసినప్పుడు నేను కూడా వారితో పాటు వెళ్ళాను. శిరిడీ వెళ్లేసరికి నాకు బాగా జ్వరం వచ్చింది. నాకు ఇష్టం లేకపోయినా, అందరూ బలవంతంగా నన్ను శిరిడీలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. వారు కొన్ని మాత్రలు ఇచ్చి పంపించారు. వాటిని నేను వేసుకోలేదు, నా జ్వరం నన్ను ఇబ్బంది పెట్టలేదు. అందరితో పాటు శిరిడీలో ఖండోబా ఆలయం నించి అన్ని ప్రాంతాలకు తిరిగాను. ఎంతసేపైనా కూర్చుని వాళ్ళందరితోపాటూ పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పారాయణ చేసేదాన్ని. అన్ని హారతులకీ హాజరయ్యేదాన్ని. పెద్దగా అసౌకర్యంగా అనిపించలేదు. ఎందుకో మాత్రలు మాత్రం వేసుకోవాలని అనిపించలేదు. ఒక రోజు యాత్రికులందరం కలిసి దర్శనానికి వెళ్ళాం. వరుసలో నడుస్తూ వుంటే మధ్యలో కూర్చోడానికి వీలుగా వేసిన బెంచీల దగ్గరకి రాగానే వరుస ఆగడంతో, నేను కూర్చున్నాను. కళ్ళుమూసుకుని బాబా నామం చెప్పుకుంటున్నాను. మనసు చాలా ప్రశాంతంగా వుంది. ఎదురుగా బాబా ప్రత్యక్షం అయ్యారు. స్వప్నంకాదు, నిజంగానే!! నాకు వారు తప్ప ఎవరూ కనపడటం లేదు. వారి చేతిలో నీటితో నింపిన పంచపాత్ర వుంది. వారు నన్ను 'అమ్మా!' అని పిలిచి దోసిలి పట్టమని, ఉద్ధరిణితో కొన్ని చుక్కలు నీళ్ళు వేసి తాగమన్నారు. నేను నీళ్లు తాగేలోపు అదృశ్యం అయిపోయారు. గుటక వేయడం నాకు తెలిసింది, నా చేతిలో తడి వుంది. భావాతీత స్థితిలో మనసు ఆనందమయంగా వుంది. చుట్టుపక్కల అన్ని వరుసలలోను చూసాను, బాబా కనిపించలేదు. ఆ క్షణం నుంచి నా ఆరోగ్యం కుదుటపడి విపరీతమైన శక్తి వచ్చింది.

అదే యాత్రలో శ్రీ సాయినాథులవారు యింకొక అపూర్వమైన అనుభవాన్ని ప్రసాదించారు. యాత్రీకులందరం శిరిడి నుండి బయలుదేరే రోజు రాత్రి శేజ్ ఆరతికి హాజరయ్యాము. ఆరతి ముగించుకుని అందరం బస్సుల దగ్గరికి చేరుకోవాలి. ఆరతి అయ్యాక దర్శనానికి వరుసలలో ముందుకు నడుస్తూ, నేను శ్రీ బాబావారికి ఎడమవైపు వచ్చాను. నాకు కొంతసేపు అక్కడ వుండాలని అనిపించింది. కానీ అందరినీ తొందరపెట్టి పంపించేస్తున్నారు. అప్పుడు నేను బాబాతో, "బాబా, మళ్లీ నేను ఎప్పుడు వస్తానో, నిన్ను వదిలి వెళ్లబుద్ది కావడం లేదు, నిన్ననే నీ ప్రత్యక్ష దర్శనం అనుగ్రహించావు, ఎంతో కృతజ్ఞతలు. అయితే ఇక్కడ కొంతసేపు నిలబడతాను, సంస్థానం సిబ్బంది నన్ను పంపించకుండా చూడు బాబా" అని చెప్పుకుని, నమస్కారం చేసుకుని, బయటికి వెళ్లకుండా, పీఠంపై నివేదన పాత్రలు పెట్టే మూలకి నిలబడ్డాను. నన్ను ఎవ్వరూ వెళ్ళమనలేదు. ఇంతలో ఒక పూజారి నా పక్కనించి బాబా పీఠం పైకి ఎక్కి, నా వైపు చూసి, నన్ను దోసిలి పట్టమని అక్కడ వున్న వెండి చెంబులో నీళ్లు పోస్తూ వున్నారు, నేను రెండు చేతులూ పట్టి తాగుతూ వున్నాను. అలా మొత్తం నీళ్లు పోశారు. తరవాత నేను తలతిప్పి ఇటు చూస్తే, బాబాకి దోమతెర కడుతున్నారు. భక్తులందరూ వెళ్లిపోయారు. మా వాళ్లు ఒక్కరు కూడా లేరు. అప్పుడు నాకు చాలా భయం వేసింది, మా బస్సు వాళ్ళందరూ ఎంత వెతుకుతున్నారో ఏమో" అనుకుంటూ బయటికి వచ్చాను. జయక్క నన్ను వెతుక్కుంటూ వచ్చి, "ఇప్పటిదాకా ఎక్కడున్నావ్? అందరూ నీకోసం వెతుకుతున్నారు" అని కోప్పడ్డారు. నేనేమీ మాట్లాడకుండా

బస్సు ఎక్కి కూర్చున్నాను. మా బస్సు శిరిడీ దాటి వచ్చేస్తుంటే, ఒక్కసారి ఆ యాత్రలో శ్రీ సాయినాథులవారు నాపై చూపించిన అనుగ్రహాన్ని తలచుకుని కృతజ్ఞతతో నమస్కరించుకున్నాను.

మావారు 2012లో కాలం చేశారు. తర్వాత నేను చాలా ఇబ్బందులు పడ్డాను. మేమిద్దరం గొలగమూడి లోనే వుండేవాళ్ళం. మాకు సంతానం లేదు. వారు కాలం చేసిన తర్వాత నేను అక్కడి నుంచి బయటికి వచ్చి కొన్నాళ్ళు మావాళ్ళ ఇళ్లల్లో వున్నాను. ఎటు చూసినా నాకు నేనుగా నిలబడటానికి ఏ ఆధారమూలేని దాన్ని. ఎన్నో ఘోరమైన పరిస్థితులు ఎదుర్కొన్నాను. కొన్నాళ్ళు మా అక్క వాళ్ళింట్లో వున్నాను. అక్క నేనూ బాగానే వున్నా, కొన్ని కుటుంబసమస్యలు వచ్చాయి. ప్రశాంతత కోసం మేమిద్దరం కోటి తీర్థం వచ్చాము. అక్కడ ఒక పెద్దావిడ, ఆవిడతో పాటూ ఒక భార్యాభర్త పరిచయం అయ్యారు. వాళ్ళు 108 దేవాలయాలకు వెళ్లి, కొబ్బరికాయలు కొట్టాలని చెప్పారు. మేమందరం శ్రీశైలం వెళ్ళాము. అక్కడ అందరం కలిసి సంస్థానం గది అద్దెకు తీసుకున్నాము. అక్కడకి వెళ్లిన మరునాడు, నేను అక్క, ఎక్కువసేపు గుడిలోనే గడిపాము. ఎంతకీ మేము గదికి రాకపోయేసరికి మాతో వచ్చినతను వచ్చి, మా బసకు తీసుకువెళ్లారు. దారిలో మాకోసం కూల్ డ్రింక్స్ కొని తెచ్చారు. బసకి వచ్చాక అవి తాగి అందరం పడుకున్నాము. మర్నాడు వుదయం బాగా తెల్లవారేవరకు




నాకు మెలకువరాలేదు. అందరం ఇంచుమించు ఒకేసారి లేచాము. పెద్దావిడ, అక్క నేను వున్నాము, ఆ భార్యాభర్తలిద్దరూ లేరు. వాళ్ళు తొందరగా దర్శనానికి వెళ్ళారేమో అనుకున్నాము. తలుపు తియ్యబోతే బైట గడియవేసివుంది. అప్పుడు ఇక అనుమానం వచ్చి ఒకర్నొకరు చూసుకుంటే, మేము వేసుకున్న బంగారం లేదు! అక్క మెడలో పుస్తెలగొలుసు, పెద్దావిడ చెవి కమ్మలు, నా మెడలో మా అక్క వేసిన చిన్న గొలుసు – ఇవన్నీ పోయాయి. కూల్ డ్రింక్స్ లో మత్తుమందు కలిపి మాకు మాత్రమే ఇచ్చారని అప్పుడు మాకు అర్థమైంది. బైట వెళ్ళేవారిని పిలిచి తలుపు తియ్యమని తరువాత పోలీసులకి ఫిర్యాదు చేసాము. ఈ భార్యాభర్తలు పేరుమోసిన దొంగలని అప్పుడు వాళ్ళు చెప్పారు. నాకు అక్కకి ఒకటే భయం, ఇంటికి వెళ్లి ఏమి చెప్పాలా అని. నా దగ్గర రూపాయి లేదు, అక్క గొలుసు నేనెలా ఇవ్వగలను అని నా భయం. పోలీసులు ఒక్క ఆధారం

ఏదైనా చెప్పమని అడుగుతున్నారు. నా చేతిలో ఎప్పుడూ, శ్రీ సాయిలీలామృతము, సంహితాయన గురుద్విసాహస్రి గ్రంథాలు వుంటాయి. నేను బాబా నామాన్ని ఆపకుండా స్మరిస్తున్నాను. ఇంతలో ఒక ఆలోచన వచ్చింది. మా పక్క గదిలో అచ్చంపేట నించి ఒక కుటుంబం దిగారు. మాతో వున్న అతను వాళ్ళతో కూడా మాటలు కలిపాడు. వాళ్ళది వ్యవసాయ కుటుంబం. బాగా డబ్బు వున్నవాళ్లే అని వారి మాటలని బట్టి తెలిసింది. ఇతను వాళ్ళ ఫోను నంబరు తీసుకుని, నేను యజ్ఞాలు చేయిస్తూ వుంటాను అని చెప్పాడు. నాకు అది గుర్తుకు వచ్చి, రూము తీసుకునేటప్పుడు ఫోను నెంబరు రాస్తారు కదా, వాళ్ళకి ఫోను చేసి, వీళ్ళు అక్కడకి వెళ్లారేమో కనుక్కోమని నేనే చెప్పాను. ఇది మాత్రం ఖచ్చితంగా బాబా ఇచ్చిన ఆలోచనే! నాకు అంత లోతుగా ఆలోచించే సామర్థ్యం వుండదు. పోలీసులు ఆ ఆధారంతో వాళ్లకి ఫోను చేయగానే వీళ్ళు అక్కడే వున్నారని తెలిసి, పోలీసులు ఆ యింటివారికి విషయం చెప్పి వాళ్ళని వెళ్లకుండా చూడమని, వెంటనే వెళ్లి వాళ్ళని పట్టుకున్నారు.

మా అక్క ఇంట్లో మాకు ఎవరూ అనుకూలంగా లేరని తెలుసుకున్న పోలీసులు ఆ వస్తువులు మాకు ఇవ్వకుండా ఫలానా పోలీసు స్టేషన్ కి రమ్మని, ఫలానా కోర్ట్ కి రమ్మని బాగా తిప్పారు. కానీ మా వస్తువులు ఇవ్వలేదు. ఇక చేసేది లేక బాబానే శరణు వేడుకుంటూ పారాయణ చేసుకునేదాన్ని. కొన్నాళ్ళకి వేరొక కేసులో ఆ పోలీసుల వుద్యోగాలన్నీ పోవడంతో, పశ్చాత్తాపంతో మా నగలు మాకు తెచ్చి ఇచ్చారు. సాధారణంగా వారికి దొరికిన వెంటనే వాటి రూపు మారిపోతుందిట. కానీ ఒకసంవత్సరం తరవాత ఎలావున్నవి అలా దొరకడం కేవలం బాబా పారాయణ, వారి అనుగ్రహంతోనే సాధ్యమయ్యింది.

తరవాత కొంత కాలానికి నెల్లూరు వచ్చేసి ఒక గది అద్దెకు తీసుకొని వుండేదాన్ని. దగ్గర్లోనే బాబా గుడి వుండేది. ప్రతిరోజూ గుడికి వెళ్లడం, ఇంటికి వచ్చాక మాస్టరుగారి గ్రంథాలన్నీ పారాయణ చేసుకోవడం ఇదీ నా నిత్యకృత్యం. నా దగ్గర ఏవో కొన్ని డబ్బులు వుంటే అవన్నీ అయిపోయాయి. వితంతు పించను కూడా లేదు. ఎటువైపునించీ డబ్బులు వచ్చే అవకాశమే లేదు. ఆ సమయంలో 2019 లో వితంతు పించను లేనివాళ్ళకి, ఫలానా చోట దరఖాస్తు చేసుకొమ్మని చెప్పారు. రేషన్ కార్డు ఒక ఊరిలో, ఆధార్ కార్డు ఒక ఊర్లో, మా వారి డెత్ సర్టిఫికెట్ ఒక ఊర్లో ఉన్నాయి. అవన్నీ కలిపి ఒకచోట చేరిస్తేనే కానీ వితంతు పించను ఇవ్వమని ఇదివరలో చెప్పారు. అది ఎంత ప్రయత్నించినా కుదరలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి. ఆపద్బాంధవా, అనాధారక్షకా అని బాబానే శరణువేడుకుని, మా ఇల్లు గల ఆమెని తోడు తీసుకుని, కార్యాలయానికి వెళ్ళాము. అతను చాలా కోపంగా "ఏంటమ్మా మూడు సర్టిఫికెట్లు మూడు ఊర్లలో వుంటే నీకు వితంతు పించను రాదు" అని విసుక్కున్నాడు. నాతో వచ్చినామె, "ఈమెకు ఏమీ తెలియదు, అలాగే అన్నీ కలిపి దరఖాస్తు పెట్టండి" అని గట్టిగా చెప్పింది. ఆమె అందరితో గట్టిగా మాట్లాడటం, నేను మనసులో నామ స్మరణ చేసుకోవడం,,,ఇదీ పరిస్థితి. చివరికి ఒకరు తీసుకున్నారు. మేము హమ్మయ్య అనుకుని ఇంటికి తిరిగివచ్చాను.మూడు నెలలు గడిచిపోయాయి.నాతో పాటు ప్రయత్నించిన వాళ్లందరికీ అప్పుడే ఇచ్చేసారని తెలిసింది. ఈసేవ ద్వారా సచివాలయానికి ఫోన్ చేయించమని ఎవరో సలహా ఇచ్చారు. అలా చేస్తే 3నెలల పించను వచ్చి వుందని, ఎల్లుండి లోపు తీసుకోకపోతే రద్దు చేస్తారని చెప్పారు. ఇక అప్పుడు బాబా పాదాలు గట్టిగా పట్టుకుని, ఎలాగైనా ఈ డబ్బు వచ్చేలా చెయ్యమని వేడుకున్నాను. ఇక చూడండి ఆయన లీల, ఎప్పుడూ ఎవరితో మాట్లాడని ఒకబ్బాయి వాళ్ళమ్మగారు, ఈ విషయం తెలిసి, మర్నాడు వాళ్ళ కారులో నన్ను వెంకటాచలం మండల కార్యాలయానికి తీసుకెళ్లారు. వాళ్లతో(పొట్లాడి) మాట్లాడితే, మర్నాడు అనికేపల్లి పంచాయితీ లో తీసుకొమ్మన్నారు, అక్కడకి వెడితే, ఇవన్నీ చూసే సెక్రటరీ ఎక్కడికో వెళ్ళాడు. ఫోను చేస్తే, మీ ఇంటికే వచ్చి ఇస్తాను, పొమ్మన్నాడు. ఎట్టకేలకు నెలకి 1000 రూపాయల చొప్పున 3 నెలలకి 3000 వితంతు పించను నా చేతికి వచ్చింది. ఆ సమయంలో ఆ డబ్బు నాకు ఎంతో ఎక్కువ. అదేరోజు ఒక 1000 రూపాయలు బాబా గుడిలో అన్నదానానికి సమర్పించాను. నిజానికి వాళ్ళు చెప్పినట్లు, తలొక ఊరిలో వున్న సర్టిఫికెట్లతో పించను రావడం కుదిరే పనికాదు. ఇలాంటి ఎన్నో కష్టాలు, శ్రీ సాయినాథుల అనుగ్రహంతో దాటగలిగాను.

ఇప్పుడు నెలకి 4000 పించనుతో, శ్రీబాబా, శ్రీవెంకయ్య స్వామి ఆజ్ఞ మేరకు, గొలగమూడిలో స్థిరనివాసం ఏర్పరచుకొని ప్రశాంతంగా జీవిస్తున్నాను. ●

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ అంబటి శివాజీగణేషన్**

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ 86వ జయంతి మహోత్సవ సందర్భంగా వారి లీలా వైభవాన్ని ఒంగోలు కి చెందిన అంబటి శివాజీగణేషన్ గారు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

ఒంగోలులో పాత గుంటూరు రోడ్డు లో వున్న 'శివ ఆర్ట్స్' అనే గ్యారేజ్ మాది. దీనికి పునాది నేను ఆరవ తరగతిలో వున్నప్పుడు జరిగిన సంఘటన. అప్పటికి నాకు శిరిడి సాయిబాబా అంటే తెలియదు. ఒకరోజు రోడ్డు మీద నడుస్తూవుంటే పక్కన పగిలిపోయిన శిరిడి సాయిబాబా పటం నుంచి గాలికి కాగితం బయటకు వచ్చి నాకు తగిలింది. నాకు చిత్రలేఖనం (డ్రాయింగ్) అంటే చాలా యిష్టం. ఆ కాగితాన్ని యింటికి తీసుకువచ్చి ఆ రోజు అందులోని చిత్రాన్ని వేసాను. తరువాత దానిని మా నాన్నకు చూపించి ఈయన పేరేమిటి అని అడిగాను. 'శిరిడీ సాయిబాబా' అని చెప్పి, నన్ను ఒక రోజు లాయర్ పేటలో వున్న బాబా గుడికి తీసుకువెళ్లారు. అప్పుడు అక్కడ బాబా పటం మాత్రమే వుండేది. ఒకసారి అక్కడ పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిని చూసినట్టు లీలగా గుర్తుంది. శ్రీ సాయినాథుని దయవలన క్రమేపి నేను మంచి చిత్రకారుడిగా ఎదిగాను. చిన్నప్పటి నించి పేద కుటుంబం అవడం వల్ల సమాజంలో అటువంటివారు ఎదుర్కొనే యిబ్బందులు చూసి, అనుభవించి, బాగా డబ్బు సంపాదించాలన్నదే నా ధ్యేయం, లక్ష్యంగా పెట్టుకున్నాను. జన్మతః చిత్రలేఖనం అంటే యిష్టం, కష్టపడే మనస్తత్వం – ఈ రెండూ నన్ను లక్ష్యం వైపు నడిపించాయి. 1994 లో నవభారత్ థియేటర్ ఎదురుగా 'శివ ఆర్ట్స్' అని ఒక వర్క్ షాప్ తెరిచాను.

శ్రీ వెంకటస్వామినాయుడు నాకు అత్యంత ఆప్తుడు. అతడు పూజ్యశ్రీ మాస్టరుగారికి భక్తుడు. పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి అనంతరం 2000 సంవత్సరంలో కోర్టు తీర్పు మనకి అనుకూలంగా వచ్చాక, మందిరం అభివృద్ధి చేసే కార్యక్రమంలో కొంతమంది భక్తులు దానికి పూనుకున్నారు. ఆ సందర్భంలో వెంకటస్వామి నన్నుకూడా చందా అడిగాడు. శ్రీ సాయినాథునికి తప్పించి నేను ఎవ్వరికీ దణ్ణం పెట్టేవాడిని కాదు. నాకు మనసు బాగోకపోయినా, పనిలో ఏమైనా సమస్య వచ్చినా తిన్నగా బాబా గుడికి వచ్చి ఆయనతో చెప్పుకుని వెంటనే వెళ్లిపోయేవాడిని. పక్కనే పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి వైపు వెళ్ళేవాడిని కాదు. నాకు ఒక పెద్ద ప్రశ్న వుండేది. ఆయనగారు(పూజ్యశ్రీ మాస్టరుగారు) కూడా బాబా గురించే చెప్తున్నారు కదా,, వీళ్ళందరూ తిన్నగా సాయినాథులవారినే పూజించకుండా మధ్యలో ఈయన్ని ఎందుకు పట్టుకున్నారు? నాలాంటివాడే 'యిలా జరిగింది బాబా' అని చెప్పుకుంటే కష్టాలు తీరిపోతున్నాయే, వీళ్ళందరూ నాకంటే భక్తులు కదా, యిన్ని వ్యవహారాల్లో ఎందుకు చిక్కుకుంటున్నారు? అనిపించేది. అందువల్ల చందా అడిగిన నా స్నేహితుడితో, 'యిలాంటి వాటిల్లో నన్ను కలపొద్దు, నేను చందా యివ్వలేను. నాకు వారెవరో కూడా అంతగా తెలియదు' అని చెప్పేసాను. 'సరేలే' అని ఊరుకున్నాడు.

ఒకసారి స్టిక్కర్స్ కట్ చేసే ప్లాటర్, కింద పడి విరిగిపోయింది. దాని ఖరీదు 6000 రూపాయలు. దానిలో ఒక హోల్డర్ విరిగిపోయింది. అది 3000 రూపాయలు. వాటిని అమ్మే షాప్ అతను నాకు బాగా తెలుసు. అతనికి ఫోన్ చేస్తే, ఆ పార్ట్ నాకు తెలిసిన అతని దగ్గరుందని, 3000

రూపాయలకు తక్కువకి యివ్వను అన్నాడని చెప్పాడు. నేను ఫోన్ చేసి చాలా బ్రతిమాలినా ధర తగ్గించలేదు. యిక తప్పదని దానిని కొనడానికి హైదరాబాదు వెడుతూ, బాబా కి చెప్పి పోదామని గుడికి వచ్చాను. అక్కడ వెంకటస్వామి కనబడి 'చందా సంగతి ఏం ఆలోచించావు?' అన్నాడు. 'మళ్ళీ చెప్తాలే' అని తప్పించుకుని బాబాకి చెప్పుకొని వెళుతూ వెళుతూ పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి ముందు నిలబడి, 'నేనొక వస్తువు కొనడానికి వెడుతున్నాను. అతను నాకు ఎంత తక్కువ ధర కిస్తే, తగ్గించినదంతా మీకు చందాగా యిస్తాను' అని నమస్కారం చేసుకున్నాను. హైదరాబాద్ లో అతని షాపుకి వెళ్లి కూర్చోగానే, ఏదో ఫోను వస్తే అతను లోపలికి వెళ్ళాడు, ఎదురుగా బాబా ఫోటో వుంది. ఏదైనా ఫోటో కనిపిస్తే దాన్ని గీయడం నాకు అలవాటు. జేబులో చిన్న పేపర్ వుంటే తీసుకొని అతను వచ్చే లోపల ఆ బాబా బొమ్మ వేశాను. అతను రాగానే అది చూసి చాలా ఆనందపడి 3000 కి ఒక్క పైసా కూడా తగ్గను అన్న వ్యక్తి 1000 రూపాయలకి ఆ హోల్డర్ ని నాకు యిచ్చి, కాఫీ కూడా యిచ్చి పంపించాడు. నేను తిరిగి రాగానే 2000 రూపాయలు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి నిర్మాణానికి చందా యిచ్చాను.

కొద్దిరోజుల తర్వాత వెంకటస్వామి మొదలగు భక్తులందరూ పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటం వేయించాలని అనుకున్నారు. నా స్నేహితుడు 'మాస్టరుగారి చిత్రపటం వేస్తావా' అని నన్ను అడిగాడు. "నాకన్నా సూర్య ఆర్ట్స్ వెంకటేశ్వరరావుగారు చాలా గొప్ప చిత్రకారుడు. ఆయన చేత వేయించండి" అన్నాను. 'లేదు, నువ్వే వెయ్యాలి' అన్నాడు. "నాకు అంత తీరుబడి లేదు, పైగా పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటం వేసే అంత స్థాయి కూడా లేదు" అని చెప్పాను.

కానీ కొంతకాలం వాదోపవాదాలు తర్వాత చివరికి నా చేత వేయిస్తానని ఒప్పించారు. వెంటనే పక్కనే వున్న శ్రీ సాయినాథునివారి దగ్గరికి వెళ్లి 'నన్ను మాస్టరుగారి చిత్రపటం వేయమంటున్నారు. అది చాలా బాగా వచ్చేటట్లు నువ్వే ఆశీర్వదించాలి' అని నమస్కారం చేసుకున్నాను. మాస్టరుగారి మీద నాకు గురి లేకపోయినా, పని సమర్థవంతంగా చేయడం అన్నది నా వుద్దేశ్యం. చాలా మంది భక్తుల హృదయాలలో వారు స్థానం సంపాదించుకున్నారు కనుక వారందరూ మెచ్చేటట్లు వుండాలి అనేది నా భావన.

పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటం ఎక్కడ వేయాలి అనేది నాకు ఒక పెద్ద సమస్యగా అనిపించింది. ఇంట్లోనే వెయ్యాలి అని మాత్రం నిర్ణయం తీసుకున్నాను. అప్పట్లో మా యిల్లు చాలా చిన్నది. రేకుల యింట్లో వుండేవాళ్ళం. మేముండే యింట్లో వంటగది, పడక గది కాకుండా, ఒక వాష్ రూమ్, దానికి ఎదురుగా యింకొక గది. అదే స్టోర్ రూమ్ అదే పిల్లలకు స్నానాలు చేయించే గది అలా వాడేవాళ్ళం. ఆ గదికి మాత్రమే తలుపు వుండేది. అందుకే ఆ గదిని ఎన్నుకున్నాను. మా పిల్లలు చాలా చిన్న పిల్లలు. దీన్ని మేము పడుకునే గదిలో పెడితే నేను షాప్ కి వెళ్ళినప్పుడు వీళ్ళు ఏదైనా చేసేస్తారేమోనని భయమేసి, ఆ స్టోర్ రూమ్ లాంటి దాన్ని ఖాళీ చేయించి, దాన్ని పసుపుతో కడిగి, కర్పూరంతో ధూపం వేసి దాన్ని చక్కగా పవిత్రంగా తయారు చేసి, అక్కడ చిత్రం వేయడం మొదలుపెట్టాను. బైటికి వెళ్ళినప్పుడు తాళం వేసేవాడిని. నాకు నమూనాగా ఐదు అంగుళాల చిత్రపటాన్ని యిచ్చారు. నేను ప్రతిరోజు షాపు నుంచి వచ్చేసరికి రాత్రి 12:00 అవుతుంది. తిరిగి తెల్లవారుఝామున మూడు గంటలకు లేచి స్నానం చేసి, ఆరు గంటల వరకు ఆ గదిలో కూర్చుని, పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటాన్ని వేసేవాడిని. ఆరు గంటలకు తిరిగి షాపు కి వెళ్ళేవాడిని. ఆ రకంగా చేస్తూ వుంటే 42 రోజులు పట్టింది. సాధారణంగా ఏ బొమ్మ వేసినా కళ్ళు చివరికి వేయడం ఆనవాయితీ. అలా కళ్ళు వేసేటప్పుడు మాత్రమే ఊపిరి బిగబట్టి అంటే ఒకసారి శ్వాస తీసుకుని దాన్ని ఆపి, ఆ భాగం వేశాక, మళ్ళీ శ్వాస వదిలి,,, యిలా చేస్తాను. అంటే శ్వాస తీసుకొని వదిలేటప్పుడు ఆ కదలికకి ఎక్కడ చెయ్యి కదులుతుందోనన్న భావన వుండేది. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటం మొత్తం అలాగే చిత్రించాను. అంత దృఢమైన భావన ఎందుకు వచ్చిందో నాకే అర్థం కాలేదు. అలా వేయడం వల్ల 42 రోజుల తర్వాత తలలో నరాలు ఒత్తిడికి గురై జ్వరం వచ్చింది.

పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటాన్ని ఆవిష్కరించే రోజు వచ్చింది. ఆరోజు యిప్పుడు వున్న కుర్తాళం పీఠాధిపతి (శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి) గారి చేతుల మీదుగానే ఆవిష్కరణ జరిగింది. వుదయమే చిత్రపటాన్ని తీసుకొని నేను కూడా వెళ్లాను. మాస్టరుగారి సమాధి మందిరం లోకి పీఠాధిపతిగారు, వారి సేవకులు, వేద పండితులు, కమిటీ సభ్యులు అందరూ కూడా లోపలికి వెళ్లారు. నాకు లోపలికి వెళ్లే

అవకాశం లేకుండా పోయింది. ఒకరకంగా యివ్వలేదని చెప్పవచ్చు. నాకు చాలా బాధేసింది. మళ్లీ ఎప్పటిలాగే బాబా దగ్గరికి వెళ్లి కళ్ళల్లో నీళ్లు తిరుగుతూ వుంటే ఆయనతో చెప్పుకొని బాధపడ్డాను. ఈలోపల కొంతమంది కమిటీ సభ్యులు వచ్చి, 'పీఠాధిపతులు, మిమ్మల్ని తీసుకురమ్మన్నారు' అన్నారు. అప్పుడు వారందరితో కలిసి మాస్టరిగారి సమాధి మందిరంలోకి అడుగు పెట్టాను. పీఠాధిపతి గారు పటాన్ని ఆవిష్కరించాక, నాకు శాలువా కప్పి, పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాలు యిచ్చారు. నేను వారికి నమస్కారం చేసుకుందామని కిందకి వంగబోతుంటే, అప్పుడు చుట్టుపక్కల వాళ్ళు 'వారిని తాకొద్దు' అన్నారు. అప్పుడు స్వామి, ఫరవాలేదని నన్ను నమస్కారం చేసుకోమన్నారు. అక్కడున్న ప్రతివారు నేను వేసిన పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటం చాలా బాగుందని మెచ్చుకున్నారు. నాకు చాలా సంతోషం వేసింది. అది బాబా దయ అనుకున్నాను. తరవాత కూడా బాబాకి నమస్కారం చేసుకుని వెళ్లిపోయేవాడిని కానీ మాస్టరుగారి దగ్గరికి వెళ్లేవాడిని కాదు. 'నాకు ఒక బాధ్యత అప్పగించారు, అది చేశాను' అన్నదే భావం.

తర్వాత కొన్నాళ్ళకి పూజ్యశ్రీ మాస్టరుగారి కాంస్య విగ్రహం చేస్తున్నారని తెలిసింది. నాకు అప్పుడు ఏదో చిన్న ప్రమాదం అయ్యి కుడి చెయ్యికి దెబ్బ తగిలి కట్టు కట్టుకుని వున్నాను. మళ్లీ నా స్నేహితుడు వెంకటస్వామి వచ్చి ఒకసారి ఆ విగ్రహాన్ని పరిశీలించమని చెప్పాడు. నాకు చెయ్యి బాగా లేదు కనుక రాలేనని చెప్పాను. కాదు నువ్వు పూజ్యశ్రీ మాస్టరుగారి చిత్రపటం వేశావు, కనుక వారి శరీరంలో ప్రతిభాగము ఎలా వుండాలన్నది నీకే బాగా తెలుస్తుంది, ఏమైనా సరే ఒకసారి రమ్మన్నాడు. సరేనని వెళ్ళాను. పూజ్యశ్రీ మాస్టరుగారు అది కూడా నా చేతనే చేయించారు. ఇంత జరిగినా మాస్టరుగారి పట్ల నా భావంలో మార్పు లేదు. కానీ మనసులో ఏదో ఊగిసలాట మొదలయ్యింది.

వీరందరూ యింతగా నమ్ముతున్నారు, అసలు బాబాను పూజించటానికి వేరొక గురువు అవసరమా? వీరందరూ భక్తితో ఆయన శరీరాన్ని తెచ్చి యిక్కడ పాతిపెట్టి, దానికి ఒక చిత్రపటం వేసి పూజలు చేసి, ఊరేగింపుకోసం ఒక విగ్రహం తయారు చేయించడం,,, ఏమిటిదంతా? తీరా నమ్ముకున్నాక ఆయన సరైన గురువు కాకపోతే జీవితం మొత్తం వృథా అయిపోతుంది కదా! అనిపించేది. అప్పుడు నా వయస్సు 30 సంవత్సరాలు. ఈ భక్తులందరి మనోభావాలు నాకు అర్థమయ్యేవి కాదు. అలాగని నమ్మకుండా వుండడం వల్ల నాకు వచ్చిన ఈ చక్కటి అవకాశాన్ని జారవిడుచుకుంటున్నానా? అన్న భయం కూడా లోపల ఎక్కడో వుండేది.

తర్వాత నేను ఈ పెయింటింగ్ వర్క్ తోనే కాకుండా స్టోన్ వర్క్ కూడా చేయాలని అంటే ఒక రకంగా శిలాఫలకాలు లాంటివి తయారు చేసే పని కూడా చేయాలని నిర్ణయించుకున్నాను. ఆ పని యిచ్చే ఆయన కోసం, వారం పది రోజులు తిరిగాను. ఆ వ్యక్తి తటస్థపడలేదు. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారికి స్టోన్ వర్క్ యిప్పించమనిచెప్పి నమస్కరించుకుని షాపుకి వెళ్ళగానే, ఆ పని యిచ్చే ఆయనే వచ్చి, "స్టోన్ వర్క్ వుంది చేస్తావా?" అనడిగారు. 'చేస్తాను సార్' అనగానే, "మంగమూరుడొంక లోని, భరద్వాజ మాస్టరుగారి నిలయం నుంచి అంజయ్య రోడ్డు వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాం. మీరు దాని శంకుస్థాపనకు శిలాఫలకం చెయ్యాలి' అదేకాకుండా భరద్వాజ నిలయం నించి అయ్యప్పస్వామి గుడి వరకు యింకొక సి సి రోడ్డు నిర్మాణం, అక్కడొక శిలాఫలకం, రెండూ చెయ్యాలి" అన్నారు. కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. మొట్టమొదట వారి నోటి నుంచి నేను విన్న పేరు 'భరద్వాజ మాస్టరుగారు'. నువ్వు వున్నావయ్యా అనుకుని వెంటనే ఆనందంతో తప్పకుండా చేస్తానని చెప్పాను. అలా నా మొట్టమొదటి స్టోన్ వర్క్ పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి పేరుతోనే మొదలైంది.

ఆ రోజు బాబా మందిరానికి వెళ్లి, మొట్టమొదటిసారి మనస్ఫూర్తిగా మాస్టరుగారి సమాధి మందిరంలో, వారి ఎదురుగా కళ్ళుమూసుకుని కూర్చుని మనసులో "అయ్యా! నన్ను క్షమించండి. మీ గురించి ఏమాత్రం అవగాహన లేక మిమ్మల్ని అనుమానించాను, మీ మందిరానికి చందా యివ్వడానికి మీకే పరీక్ష పెట్టాను. ఇటువంటి నా చేతనే మీ చిత్రపటం వేయించుకున్నారు. ఈరోజు ఊహించని అవకాశాన్ని ప్రసాదిస్తున్నారు" అని చెప్పుకుంటూ ఒకరకంగా ధ్యానంలోకి వెళ్లి వుంటాను, నాకు అంతవరకు అటువంటి అనుభవం లేదు. అయితే అకస్మాత్తుగా అక్కడ దృశ్యం మారిపోయింది. పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధిలోనించి బైటకి వచ్చి "నాతో లోపలికి రా" అన్నారు. సమాధి లోపలికి మెట్లు వున్నాయి. నేను వారి వెనకే వెళ్లాను. ఎదురుగా

సింహాసనంమీద సాయినాథులవారు కూర్చుని వున్నారు. వారికి ఒక పక్క కొంతమంది ఋషులు వున్నారు. యింకొకపక్క పూజ్యశ్రీ మాస్టరుగారు నిలబడి బాబాతో "వీడు యిప్పటికి లోపలికి వచ్చాడు" అన్నారు. అప్పుడు బాబాగారు "ఏరా యిన్నాళ్లూ బయటే తిరుగుతున్నావ్" అని, పూజ్యశ్రీ మాస్టరుగారితో "ఇకనించి వీడిని నువ్వే చూసుకో" అని చెప్పి, నాతో, "నీకేమైనా సందేహాలు వుంటే యిక్కడ అడుగు" అని పూజ్యశ్రీ మాస్టరుగారిని చూపించారు. నేను మళ్ళీ మెట్లెక్కి పైకి రాగానే, పూజ్యశ్రీ మాస్టరు గారు, నేను కొత్తపట్నం సముద్రం దగ్గర వున్నాం. వారు సముద్రంలో నా చేత మూడు మునకలు వేయించారు. అక్కడ ఒక పెద్ద శివలింగం వుంది. మూడు చెంబులు నీళ్లతో శివలింగానికి అభిషేకం చేయించారు. ఈ లోపల మధ్యాహ్న హారతి సమయం అవడంతో సమాధి మందిరం తలుపులు వేయడానికి గుడి కాపాలాదారుడు వచ్చి నన్ను లేపడం జరిగింది. చాలాసేపు బయటి ప్రపంచంలోకి రాలేకపోయాను. ఇంతటి మంచి అనుభవాన్ని ప్రసాదించినందుకు మనస్ఫూర్తిగా పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకొని బయటకు వచ్చాను.

అది మొదలు ప్రతిరోజూ వుదయం 5 గంటలకు కొబ్బరికాయ తీసుకువచ్చి, పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి తాకించి నమస్కారం చేసుకుని, ధునిలో వేసి షాపుకి వెళ్లడం నా నిత్యకార్యక్రమం. పూజ్యశ్రీ మాస్టరుగారి దయతో వారి యింటినించి మొదలుపెట్టిన స్టోన్ వర్క్, అంచలంచలుగా ఎదిగి, తిరుమల, కాశీ, శిరిడి, శ్రీశైలం, చిన్న జీయర్ ట్రస్ట్ మొదలైన దేవస్థానాలకి చేసాను. ఒక సైకిలు మీద తిరిగే నన్ను ఈరోజు 25 లక్షల కారులో తిరిగేటట్లు చేశారు. వర్కుషాప్ స్థానంలో 20 మంది వర్కర్స్‌తో గ్యారేజ్ పెట్టే స్థితికి తీసుకువచ్చారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక అనుభవాలనీ, అనుభవ పాఠాలనీ నేర్పించారు. ఉన్న ఒక్క జీవితాన్నీ వృధా కానీయకుండా ప్రతీ క్షణం జీవింపచేసిన శ్రీ సాయి, శ్రీ మాస్టర్ లకు శతసహస్రకోటి కృతజ్ఞతాపూర్వక వందనములు సమర్పించుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!

# మాతృదేవి స్మృతులు

13వ పేజీ తరువాయి

నేను దర్శనానికి వెళుతుండేదానిని. పూజ్యశ్రీ అమ్మగారు సిద్ధిపొందాక చివరిగా నమస్కారము చేసుకోవడానికి రాలేకపోయాను. దానికి నేను చాలా బాధపడి చాలారోజులు ఏడ్చాను. ఒకరోజు పూజ్యశ్రీ అమ్మగారు స్వప్నంలో ఒక ఇంటి అరుగు మీద కూర్చుని వున్నారు. ఆమె ముందు ఒక చిన్న కాలువ ప్రవహిస్తోంది. నేను పూజ్యశ్రీ అమ్మగారికి సంతోషంగా నమస్కారము చేసుకున్నాను. అప్పటినుంచి ఆ బాధ తొలగిపోయింది.

ఏ సమస్య వచ్చినా వేదమ్మతల్లికి ఫోన్ చేసి పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పుకున్నట్లే చెప్పుకుంటాను. ఈమధ్య మావారికి ఆరోగ్య సమస్య వస్తే వేదమ్మతల్లికి ఫోన్ చేస్తే పారాయణ చెప్పారు. చాలా చిత్రంగా కొండంత ప్రమాదం చిటికెలో తప్పిపోయింది!

ఇప్పుడు పిల్లలిద్దరూ స్థిరపడ్డారు. మేము హైదరాబాదులోని గాజులరామవరంలో ఇల్లు కట్టుకుని స్థిరపడ్డాము. కానీ ఇప్పుడు ఒక్కదానినే రాలేను. అయితే ఎప్పటికైనా పూజ్యశ్రీ అమ్మగారి బృందావనానికి రావాలని కోరిక. ఆ తల్లి తప్పకుండా తీరుస్తారు అనుకుంటున్నాను.

నేను మొట్టమొదట పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వచ్చినరోజు పాదనమస్కారం చేసుకుంటూ, "నన్ను ఎప్పుడూ వదిలిపెట్టకండమ్మా! ఒకవేళ నేను మతిమాలి మిమ్మల్ని వదిలి పక్కకి వెళ్లినా, మీరు మాత్రము నన్ను వదలవద్దు" అని దీర్ఘ నమస్కారము చేసుకున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు ఆరోజు నావైపు చాలా ప్రసన్నంగా చూసి నవ్వారు. ఆ నవ్వు ఎప్పటికీ మర్చిపోలేను. నేను అమ్మ సన్నిధికి రాకముందూ, వచ్చాక కూడా నన్ను నడిపించేది పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లేనని నా ప్రగాఢ విశ్వాసం.

అంతటి దయాళువూ, కరుణాపూర్ణ హృదయముగల పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి స్మరణ నిరంతరం నాలో జరుగుతూ వుండాలని, నాతో చివరికంటా వుండి నన్ను గమ్యం చేర్చాలని ప్రార్థిస్తున్నాను.

జై సాయి మాస్టర్!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



శ్రీ మాణిక్య ప్రభు ఆరాధన

(11.12.2024 - మార్గశిర శుద్ధ ఏకాదశి)

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



పూజ్య గురుదేవులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారి జన్మదినోత్సవ వేడుకలు శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము (గుమ్మళంపాడు)లో తేదీ ప్రకారము అక్టోబరు 30, బుధవారం నాడు మరల తిథి ప్రకారము నవంబరు 8, కార్తీక శుద్ధసప్తమి నాడు వైభవంగా జరిగాయి.